# కాలజ్ఞానసుధ

ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏప్రియల్ - 2015 సంపుటి: 19 సంచిక: 4




ఈ నెల సూక్తి

 అనుభవంలోనికి రాని విద్య వీపుకు తగిలించుకున్న లాంతరు లాంటిది. అది తనకు వెలుగును చూపకపోగా ప్రమాదాన్ని తెచ్చిపెడ్తుంది.



## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం - శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి తపోసమాధి | 4 |
| విశ్వాసముంటే విధినైన ఎదిరించవచ్చు | 7 |
| వేద పరిచయము - యజుర్వేద పరిచయం | 9 |
| వీరకాళికాంబా శతకం - కరుణ మతము | 12 |
| ఆది గురువు ఆచార్య శంకరులు | 15 |
| యోగవాసిష్ట కథాలహరి-కామికాని మోక్షగామి దాశూరుడు | 18 |
| మహాభారతంలోని - నీతి కథలు | 21 |
| జ్ఞానసుధ - జన్మ పరంపర | 23 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (ద్వేషము) | 25 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 28 |
| రఘువంశం | 30 |
| శ్రీరామ భక్తి (సదా శివుని శ్రీరామభక్తి) | 31 |
| దర్శనీయ దేవాలయాలు (భద్రాచలం) | 34 |
| వివిధ వ్యాధులు ఆయుర్వేద చికిత్సలు | 37 |
| వాస్తు - సైన్సు | 38 |


ముఖచిత్రం : శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారు (తోట్లపల్లి, బ్రహ్మంగారి మఠం)


చందా వివరములు

జీవిత చందా(20సం॥) : 1116/-

సంవత్సర చందా : 70/-



చందాలు పంపవలసిన చిరునామా:

కాలజ్ఞాన సుధ

శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు-523002 ప్రకాశం జిల్లా (ఆం.ప్ర)
ఫోన్స్ 08592/235341, 9949132469, 9705555229,
8977799289



సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు




## శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారు సమాధికేగబోవు ముందు భక్తాదులకు కాలజ్ఞానబోధ

## గోవింద వాక్యాలు

45. ఆదవేణిలోను కప్ప కోడికూత అందరు వినగను అరచీనిమా।
మేదిని మీదను తాడిపర్తిలోను మేక మనిషి రూప మయ్యానిమా ॥శివ॥

48. కందుకూరులోని స్త్రీ పురుషు డయ్యాని కలకోడి తర్వాత గూసీనిమా
సందేహమే లేదు సామగానము చెవుల సకలమైన వారు వినేరుమా॥శివ॥

90. హంపిలో నుండేటి హనుమంతరాయుడు అరచి వీధుల కేక వేసీనిమా।
ఆకేక తగ్గట్టె మహానంది మూలంతా ఆకు రాలినట్లు రాలేరుమా ॥శివ॥

131. భువిలో దక్షిణ అమెరికా దేశమున భూకంపం బహుగాను బుట్టీనిమా।
అదిరిన ఆ నగర మందు సర్వాత్ములు బెదిరియు నాశన మయ్యేరుమా॥శివ॥

Sri Achalananda Ashramam, Ongole and Thettapalli

స్వామి తన సందేశాన్ని, కాలజ్ఞానాన్ని వినిపించి అందరిని ఆశీర్వదించారు స్వామి తపస్సు కేగు ఘడియలు సమీపిస్తుండగా

గోవిందమాంబా వీరబ్రహ్మేంద్రులు సమస్త దేవ ఋషి భక్త గణంబులను ఆశీర్వదిస్తున్నారు.

కొలువుదీరియున్న సమస్త దేవతలు గోవిందమాంబావీరబ్రహ్మేంద్రుల ఆశీస్సులకై నిరీక్షిస్తున్న వారికీ విధంగా గోచరిస్తున్నారా అనాది దంపతులు.

దివ్యమైన జటాజూటమున నాగాభరణములు ప్రకాశించుచుండగా, త్రినేత్రధారియై, పసిడికాంతులతో ప్రకాశిస్తున్న హేమకుండలములు కలిగి, కంఠమందు భక్తతతులకు వైరాగ్యమిచ్చు రుద్రాక్షలను ధరించి, యోగరాజు నాగరాజు కంఠాభరణముగను, యజ్ఞోపవీతముగను, హస్తాభరణములుగను ప్రకాశించు చుండగా, వజ్రపాదుకలతో సూర్యసమన్విత కాంతులీను [2]గండపెండేరములను ధరించి పట్టుపీతాంబరధారియై, ఒక చేత త్రిశూల డమరుకంబుల బట్టి, మరియొక చేత కాలజ్ఞానమును ధరించి, ఇంకొకచేత దండ కమండలువుల బూని, చిన్ముద్రాభయహస్తముతో, చిరుమంద హాసముతో దేవతల నాశీర్వదిస్తున్న ఆ వీరబ్రహ్మేంద్రుని దివ్యకాంతి దిగ్దిగంతాలకు వ్యాపిస్తున్నది. □

ప్రతినిత్యం దివిజులచే ప్రస్తుతించబడు వీరబ్రహ్మేంద్రుని పత్ని మహిమా న్వితమైన జటాజూటం అందుండి జాలువారిన కురులతో, త్రిగుణములకు ప్రతీకలైన త్రీనేత్రధారిణియై, ముజ్జగముల ప్రకాశింపచేస్తున్న ముక్కెర దేదీప్య మానంగా వెలిగిపోతుండగా, హేమకాంతులతో ప్రకాశించు కర్ణకుండలములు గలిగి, రుద్రాక్ష మాలాధారిణియై, చతుర్హస్తములకు పసిడి కంకణములను ధరించి, దక్షిణహస్తమున నాగకంకణమును ధరించి, త్రిశూల డమరుకముల నొకచేతబట్టి, దండ కమండలువుల నింకొక చేతబట్టి, నొకచేత కాలజ్ఞాన ముండగా, చిన్ముద్రాభయహస్తయై, వజ్ర పాదుకలను తొడిగి, కాంతులీను గండపెండేరములను కలిగి దరహాసంతో దీపిస్తున్న ఆ గోవిందమాంబ కోటిసూర్యప్రభలతో ప్రకాశిస్తోంది.

దేవతలు గోవిందమాంబా వీరబ్రహ్మేంద్రుల దివ్యరూపాలను దర్శించి స్తోత్రిస్తూ పుష్పవర్షం కురిపిస్తున్నారు. ద్రష్టలైన ఋషులున్నూ ఆ దివ్యదర్శనాన్ని గని స్వామిని స్తుతిస్తున్నారు సమస్త భక్తానీకము, ఆ అనాది దంపతులను ఉప్పొంగిన భక్తి ప్రపత్తులతో ప్రార్థిస్తున్నారు.

భక్తగణంబులు స్వామి గతవైభవాన్ని మననం చేసుకుంటున్నారు. స్వామి అనాది తత్త్వాన్ని, నేటి విశేషాన్ని - దాని మార్మికత్వాన్ని విశ్లేషించుకొంటున్నారు కొందరు ఋషులు ఆయన అనంత తత్త్వాన్నెరుగ సాహసించక వారిలో లయమై పోతే చాలదా! అనుకుంటున్నారు. పరమభక్తాగ్రేశ్వరులు, సముద్రంలో స్నానం చేసేవాడికి ఆవలి ఒడ్డుతో పనేమిటి? భగవంతుడనే సముద్రములో పునీతు లవ్వాలనుకునే వారికి ఆయన ఆది అంత్యాలతో పనిఏమిటి? అని నిర్మల మనస్సుతో ధ్యానిస్తున్నారు. వైమనస్యం లేక, చపల భావం రానీక, పరాధీనత నొందక అనన్య చింతనతో సేవించేవారికి తర్కా తర్కాలతో పనిలేదు. ఆ అచలపరిపూర్ణాతీతునిలో లయం కావడమే పరమావధి యని వీరబ్రహ్మేంద్రుని భక్తులంతా నిర్మలచిత్తంతో అవ్యాజ్యమైన ప్రేమలో మునిగితేలుతున్నారు.పశుపక్ష్యాది సమస్త జీవరాశి కొన్ని క్షణాలపాటు దివ్యానందాన్ని అనుభవించాయి.

అలా అందరూ మధురానుభూతిని పొందుతుండగా అమ్మవారు స్వామివారు వేదిక నుండి సమాధివద్దకు రావడానికి లేచారు.

భక్తాదులంతా జైవీరబ్రహ్మజై - గోవిందమాంబజై అంటూ జేజేలు పలుకు తున్నారు. కొందరు భక్తులు వేదిక నుండి సమాధి వరకు ఇరు వైపుల వివిధ రకములైన పూలను, పుష్పమాలికలను పట్టుకొని భక్తి ప్రపత్తుతో నిలుచున్నారు. ఋత్విక్కులు వేదమంత్రోచ్ఛారణ చేస్తున్నారు. స్వామి ఒక్కసారి నలువైపుల చూస్తూ చిరునవ్వుతో దేవ, ఋషి, భక్త, ప్రజానీకాన్నీ ఆశీర్వదిస్తుండగా,

అనంద కందళిత ముఖారవిందుడైన ఈ దేవదేవుడు యిక మనకు కనిపించడు కాబోలునని చింతాక్రాంతులై కొందరు, ఆ లోకనాయకుని విడచి ఉండట మెలాగని కొందరు, ఆహా! ఆద్యంతములు తానైన ఈ స్వామి ఆ చిన్ని సమాధిలో కూర్చుంటాడట! ఇదేమి లీలోమరి! అని అబ్బుర పడుతున్నవారు కొందరు, మీరు తపస్సు పేరుతో చాటుకు వెళితే మాగతేమిటయ్యా వీరబ్రహ్మేంద్ర ప్రభువర్యా! అని కొందరు, మళ్ళీ వస్తానంటున్న అయ్యగారికి ఈ విరామం దేనికో! నని కొందరు పరి పరి విధాల మననం చేసుకుంటున్నారు.

వీరబ్రహేంద్రస్వామి గోవిందమాంబ వేదిక దిగుతున్నారు. భక్తులు వారిపై పుష్పాలను చల్లుతున్నారు. వారలా సమాధి వద్దకు వస్తుంటే, తమ మనస్సును భక్తి పుష్పాలుగా వారి పాదాలపై చల్లి ఆనందిస్తున్నారు. వారి పాదాలపై పడే వారు, వారిని దగ్గరగా చూడాలని ఆత్రుతపడే వారు వీళ్ళందరిని క్రమబద్ధం చేసేవారు కొందరు. అలా కోలాహలంగా ఉన్నదా సన్నివేశం. దేవతలు పైనుండి పష్ప వర్షం కురిపిస్తున్నారు.

సమాధి సమీపించారా అనాది దంపతులు. స్వామి అమ్మవారి వైపు చూచారు. ఆయన చూపులోని ఆంతర్యం ఆమెకు అర్ధమయ్యింది. స్వామి ఒక్కొక్క మెట్టు దిగుతున్నారు. ఆయన ఒక్కొక్క మెట్టు దిగుతుంటే ఒక్కో లోకం దాటినట్లనిపిస్తుంది భక్తానీకానికి. సకల భువనాధినేతయైన వీరబ్రహ్మేంద్రుడు ధీర గంభీర ప్రశాంత వదనారవిందంతో సమాధియందు ప్రవేశించాడు. అమ్మవారు స్వామికి నమస్కారం చేసింది. స్వామి నీటితో దీపమును వెలిగించి వీరాసనస్థుడై చాతుర్యోగాతీత మహాతపస్సున కూర్చున్నాడు. సమాధిపై మూతబండ తనంతట తానుగా వచ్చి నిలిచింది. భక్తులు భక్త్యావేశంతో "శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామికీ" జై అంటూ కీర్తిస్తున్నారు.

దేవతలు గగనతలం నుండి పుష్ప వర్షాన్ని కురిపిస్తున్నారు. ఋషులు తమ తపశ్శక్తిని ఆ స్వామి పాదాల చెంత నుంచి నమస్సుల నర్పించారు. స్వామి దీర్ఘతపస్సున వున్నారు. సురలు అంతర్ధానమయ్యారు. భక్తులంతా ఆ దివ్యావతారుని తమ మనోఫలకంపై నిలుపుకొని "జైవీరబ్రహ్మజై - గోవింద మాంబజై" అను ద్వాదశాక్షరీ మహామంత్రాన్ని స్మరిస్తూ మధుర స్మృతులతో వెనుదిరిగారు.

దేవాధిదేవుడు, అనాది విరాట్ ప్రభువూ అయిన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి అలా తపోనిష్ఠలో వుండి నేటికీ లోకాలను కాస్తున్నాడు. భక్తులను బ్రోస్తున్నాడు. ఋషులను అనుగ్రహిస్తున్నాడు. సమస్త జీవకోటిని సంరక్షిస్తున్నాడు. అట్టి విశ్వాధినేతకు శతాధిక నమస్సులు. "జై వీరబ్రహ్మజై - గోవిందమాంబజై".

# విశ్వాసముంటే విధినైన ఎదిరించవచ్చు

.....ఆంధ్రరత్న జివి శేషారెడ్డి

(గత సంచిక తరువాయి)

ఆదిమ మానవుని దగ్గర నుంచి ఆధునిక మానవుని వరకు సాధించిన ప్రగతి అది ఏ రంగములోనైన సరే అది విశ్వసముతోనే ఊహకు అందనంత అభివృద్ధిని సాధించాడన్నది నిర్వివాదాంశము. మానవుని సాంకేతిక విజ్ఞానము హద్దులులేని విధంగా ప్రతిరోజు కొత్త విషయాలను కనుగొంటూనే ఉన్నాడు. ఇది నిత్య సత్యప్రక్రియ. నిరంతరము అంతరాన్ని ఎదుర్కొంటూ అంతర్ముఖిగా మారితే మానవుడు "అంతర్ ముఖి సదాసుఖి" అన్న నానుడిని నిజము చేయగలడు. ఆధ్యాత్మిక ప్రగతి నిజమైన పరిపక్వత. విశ్వాసాన్ని ప్రకటించినపుడు విశ్వేశ్వరుని ఎదురుగా చూడగలడు. విశ్వాసాన్ని కలిగిఉన్న, చూరగొన్న మనిషి మహోన్నతుడవుతాడు. అన్నమయ్య విశ్వాసము అనంతకోటి అఖిలాండేశ్వరుండు అయిన కలియుగదైవం అయిన ఏడుకొండలవాడితో ముచ్చటించలేదా ! భక్త తుకారాం భజనలు విఠలేశ్వరునిపై విశ్వమంతా విశ్వాసాన్ని కల్గియుండడము వల్ల పాండురంగడు ప్రత్యక్షము కాలేదా! విశ్వాసమనే విత్తనము మదిలో నాటితే పట్టుదల అనేచెట్టు మొలకెత్తి గమ్యం అనేపుష్పం, విజయమనే ఫలముకాస్తుంది. బాధ్యతలను మరిచి విధి లిఖితం ఇంతేనని తృప్తిపడేవాడు విజయానికి చేరువకాలేడు. సరికదా కనీసం ధర్మనిర్వహణలో ఎలా ప్రవర్తించాలో కూడా తెలియకుండా జీవనాన్ని పుట్టలోని చెదలు పుట్టదా గిట్టదా అన్న చందానా జీవితాన్ని గడిపితే మానవ జీవితం నిరర్థకం కదా! విశ్వాసములేని తరుణంలో ఏ కార్యము కూడా సఫలము కాదన్న నిత్యసత్యం. విశ్వసిస్తే వినూత్వాన్ని వెలికి తీయవచ్చు. మనిషికి విశ్వాసమున్నపుడు కృషికి పూనుకుంటే ఋషి కాగలడు. రోగం నయం కావాలంటే వైద్యుని మీద విశ్వాసముండాలి. సత్ గురువుపైన విశ్వాసము లక్ష్యాన్ని చేధించడానికి కొండంతబలాన్ని ఇస్తుంది. పరమాత్ముని లీలలు కోకొల్లలు. భగవంతున్ని విశ్వసించని వాడు నిరంతరము కైవల్యస్థితిలో దైవనామ స్మరణలో దివ్యత్వాన్ని పొందడం ఖాయం. చిరంజీవి శ్రీ జై హనుమాన్ల వారి, రామనామంపై విశ్వాసము వల్ల రాముడ్ని తన మదిలోనే పదిలం చేసుకోగలిగాడు. భక్తరామదాసు, భక్తతుకారం, మీరాబాయి, తులసీదాస్, కబీర్‌దాస్, అన్నమయ్యల విశ్వాసము వారిని అమరులుగా తీర్చిదిద్దాయి. వీరందరు వారి భక్తి పారవశ్యంలో వారివారి ఇష్ట దైవాలను ప్రత్యక్షంగా వీక్షించిన వారే కదా!

విశ్వాసము విజయానికి నాంది. ధర్మరాజుకు భగవాన్ శ్రీకృష్ణునిపై విశ్వాసమే ధర్మయుద్ధమైన కురుక్షేత్రంలో కౌరవులపై పాండవులు విజయం సాధించి ఏ యుగంలోనైన ధర్మం, సత్యం మాత్రమే గెలుస్తాయన్న నిత్య సత్యాన్ని లోకానికి తెలియచేసింది. కాలము దైవమే కదా! అందుకే నేమో నెపోలియన్ చక్రవర్తి "రాజ్యాలనైన పోగొట్టుకొంటాను గాని కాలాన్ని జారవిడుచుకోలేను"అని అంటాడు. దీని అర్థము తాను చేయవలసిన కార్యాలపై తనకున్న విశ్వాసముకదా! రైతు తన రెక్కల కష్టాన్ని విశ్వసిస్తాడు.

కాబట్టి పొలందున్ని పంటను పండించి మనందరికి బ్రహ్మస్వరూపమైన అన్నానికి కారణమైన ధాన్యాన్ని అందిస్తున్నాడు. దాంపత్య జీవితము అరమరికలు లేకుండా సాగాలంటే ఒకరిపై ఒకరు విశ్వాసాన్ని చూరగొన్నపుడే రైలుబండి పట్టాలమీద పయనించినట్లు దంపతులు జీవితమనే పట్టాలమీద పయనిస్తారు. గమ్యాన్ని చేధిస్తారు. నల్లని సూర్యుడు నెల్సన్ మండేలా, నీగ్రోలహక్కుల ఉద్ధారకుడు మార్టిన్ లూథర్‌కింగ్, అహింసా సిద్ధాంతము భారత స్వాతంత్ర్యాన్ని ఆర్జించి పెట్టిన గాంధీమహాత్ముడు, మానవసేవే మాధవసేవన్న ప్రేమ తత్వంతో మదర్ థెరిస్సా మొక్కవోని విశ్వసముతో వీరందరు వారి గమ్యాన్ని వారు నమ్మిన సిద్ధాంతాలను విశ్వసించడం వల్లే కదా! బైబిల్‌లో చెప్పిన ప్రకారం మొట్టమొదట మానవులు ఆదాము ... (అవ్వ) ప్రభువు చెప్పిన మాటపై విశ్వాసముంచక ఏ ఫలాన్ని అయితే తినవద్దని చెప్పిన, తినిన తర్వాత ఏర్పడిన పరిణామాలే పవిత్రగ్రంథ బైబిల్ సారాంశముకదా! 40 సార్లు పైచిలుకు ఓటమిని చవిచూచిన పట్టువదలని విక్రమార్కుడిలాగా విశ్వాసముతో అబ్రహం లింకన్ ఎన్నికలలో ప్రయత్నం విరమించక 45వ సారి అమెరికా అధ్యక్షుడుగా విజయాన్ని సాధించాడుకదా! అమెరికన్ అథెలెట్ జెస్సీ ఓవెన్స్‌ను జీవితాంతము పడక మీదనే గడపాలని వైద్యులు తేల్చి చెప్పినా తనపై తనకున్న ఆత్మ విశ్వానముతో 1930 ఒలింఫిక్ క్రీడలలోనాలుగు బంగారు పతకాలు సాధించి అమెరికా దేశము యొక్క పేరు ప్రఖ్యాతులను ఎవరెస్టు శిఖరమంత ఎత్తుకు తీసుకెళ్ళాడు. ఆధునిక మానవునికి తనపైన తనకున్న ఆత్మవిశ్వానముతోనే ఆకాశములో పక్షిలాగా విహరిస్తున్నాడు. చేపలాగ నీటిలో నిధులను కనుగొంటున్నాడు. కొండలను పిండిచేసి తనకు అనుకూలంగా మలచుకొంటూన్నాడు. ఎడారులను వ్యవసాయ భూములుగా తీర్చిదిద్దుకొంటున్నాడు. ఆత్మవిశ్వాసములో అన్ని గ్రహాలను నివాసయోగ్యం చేసుకోగలడు అనడం అతిశయోక్తి కాదేమోకదా! ఆలోచిస్తే మనిషి కనుగొన్న ప్రతి యంత్రం, మంత్రం అనిపిస్తుంది. పురాణ పురుషులు తమ తపోశక్తితో దృశ్యవాణిలో, భూత, భవిష్యత్, వర్తమానాలను తిలకించినట్లు ఎన్నెన్నో ఆధారాలు, ఋజువులు. అదే పంథాలో నేటి మానవుడు తన మేధాశక్తితో రిమోట్‌చేతిలో ఉంచుకొని ప్రపంచలో జరుగుతున్న ప్రతి విషయాన్ని దూరవాణిలో (టి.వి) వీక్షిస్తున్నతీరును గమనిస్తే మనిషికితన మేధాశక్తిపై తనకున్న విశ్వాసమే.!

## ఆత్మ జ్ఞానము

ఆచరణ ముందు ఆలోచించు
వితరణ ముందు ధర్మానెంచు
విచారణ ముందు విశ్వాసాన్ని పెంచు
గమనించే ముందు గమ్యాన్ని తలంచు
సమరానికి ముందు సంధికి
ప్రయత్నించు
వివరణకు ముందు వినూత్నముగా
ఆలోచించు
సవరణకు ముందు సమూలముగా
విచారించు
దర్యాప్తుకు ముందు ధర్మాన్ని పరికించు
విజ్ఞప్తికి ముందు విచారించు
సమర్థించే ముందు సత్‌బుద్ధితో
వ్యవహరించు
సాయంచేసే ముందు అర్హతను
గమనించు
విశ్రాంతి ముందు గమ్యాన్ని చేధించు
తనువు చాలించే ముందు ఆత్మజ్ఞానాన్ని
పొందు

# వేద పరిచయము

## యజుర్వేద పరిచయము

.......... ఆచార్య డా॥ మట్టి కృష్ణారెడ్డి ............

'యజ-దేవపూజా సంగతీకరణదానేషు' అనుధాతువు వలన 'యజుః' శబ్దము ఏర్పడును. 'యజుః' శబ్దమునకు అర్థము 'దేవత లనబడు దివ్యగుణ పదార్థములను, వ్యక్తులను పూజించుట; జడచేతన పదార్థములను సమీకరించుట - ప్రోగుచేయుట; వాటిని యథాయోగ్యముగ వితరణ-దానము చేయుట' అని అర్థము.

'యజుః. వేదము' అను రెండు పదములు కలసి 'యజుర్వేదం' అయ్యింది. ఈ యజుర్వేదం కర్మకాండను ఉపదేశిస్తుంది. ఏ కర్మలు చేయుట వల్ల మానవులకు ఇహలోక-పరలోక ఉన్నతి కలుగుతుందో ఆయా విషయాలు ఇందులో వివరించబడ్డాయి. ఋగ్వేదం జ్ఞానాన్ని బోధిస్తే ఆ జ్ఞానానికనుగుణంగా కర్మలు ఎలా చేయాలో ఈ యజుర్వేదం బోధిస్తుంది.

"యజుర్వేదః యజ్ఞోపయోగిత్వ సూపయోగాత్ సర్వోఽపి వేదో యజుర్వేద ఇత్యుచ్యతే" యజ్ఞయాగాది కర్మకాండను బోధించునది యజుర్వేదము.

యజ్ఞంలో 'అధ్వర్యుడు' చదివే మంత్రాల సముదాయమే యజుర్వేదం. యజ్ఞము యొక్క వాస్తవికవిధిని నిర్వహించువాడు అతడే కావున దీనికి 'అధ్వర్యువేద'మని కూడా పేరు వచ్చింది.

దేవతలకు హవిస్సులను సమర్పించడానికి ఈ వేదం చాలా ఉపయోగకరం. అందుకే "శేషే యజుశ్శబ్దః" అని జైమిని పూర్వమీమాంసా శాస్త్రంలో పేర్కొన్నారు. అనగా ఋక్ సామ భిన్నములైన మంత్రములు అన్నియు యజుర్వేదములో సంకలించబడినవి. యజుర్వేదములోని మంత్రములు కొన్ని నియతాక్షరావసానాదికములై పాదబద్ధములైన ఛందముగా ఉండును. మరికొన్ని గద్యాత్మకములై యుండును. ఋగ్వేదములోని కొన్ని మంత్రములు యజుర్వేదములో కూడ కనిపించును. యజ్ఞవిధానము దృష్టిలో ఉంచికొని చేసిన విభాగము కనుక ఆ ఈ విధమైన సంకలనము ఆవశ్యకమై ఉండవచ్చును.

యజుశ్శబ్దము దైవ పూజా సంగతీకరణము, దానాదులకు పర్యాయపదమని తెలుసుకొన్నాము. "యజ్ఞో వై శ్రేష్ఠతమం కర్మ" యజ్ఞము కర్మలన్నింటిలో మిక్కిలి శ్రేష్ఠమైనది. మానవునికి ఉన్నతిని కలిగించే కర్మలలో ఇది ఉత్తమమైనది. ఈ యజ్ఞము అనగా అగ్నిహోత్రము ఆవునెయ్యి, మూలికలు, సుగంధద్రవ్యాలు మొదలైన శ్రేష్ఠమైన పదార్థాలను పద్ధతి ప్రకారం అగ్నిలో ఆహుతులుగా వేస్తే పృథివీ అంతరిక్ష ద్యుస్థానీయ దేవతలు సంస్కరింపబడతాయి. అనగా జలవాయువులు, భూమి మాలిన్యరహితమవుతాయి. తద్వారా ప్రాణులన్నింటికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలు - అగ్నిహోత్రాన్ని శ్రేష్ఠతమ కర్మగా యజుర్వేదం చెబుతుంది.

యజ్ఞనిర్వహణమునకు కావలసిన మంత్రభాగముతో 'యజుస్సంహిత' నిర్మించబడినది. యజ్ఞాచరణమునకు వలయు కాలజ్ఞానమునకై జ్యోతిశ్శాస్త్రము, యజ్ఞవేదీ నిర్మాణవిధి పరిజ్ఞానమునకై వాస్తుశాస్త్రము, మంత్రార్థ నిర్ణయమునకై శిక్షవ్యాకరణ శాస్త్రాదులును యజుర్వేదమును అనుసరించి వికసించినవి.

కేవలము మంత్రాత్మకమైనది శుక్లయజుర్వేదము, బ్రాహ్మణభాగ సమ్మిశ్రితమైనది కృష్ణయజుర్వేదము. శుక్లయజుర్వేదము ఉత్తరభారతదేశములో, కృష్ణయజుర్వేదము దక్షిణభారతదేశములో ప్రసిద్ధి. వర్ణ్యవిషయమును బట్టి చూచినచో శుక్ల కృష్ణ సంహితలకు ఏమంత అధికమైన భేదము కనబడదు. కాని రచనలో శుక్లయజుర్వేదము కేవలము మంత్రాత్మకముగను, కృష్ణయజుర్వేదము మంత్రభాగముతోపాటు తన్నియామక బ్రాహ్మణ భాగమును కూడా కలిగియున్నది.

'ఏకశతమధ్వర్యు శాఖాః' అని పతంజలి దీనికి నూరు శాఖలున్నట్లు చెప్పెను. చరణవ్యూహములో దీనికి 86 శాఖలు మాత్రమే కలవని వ్రాయబడెను. కాని నేడు మనకు శుక్లయజుశ్శాఖలు రెండు, కృష్ణయజుశ్శాఖలు నాలుగు చేరి మొత్తము ఆరు శాఖలు మాత్రమే సంహితలుగా లభించుచున్నవి.

శుక్లయజుర్వేదశాఖలకు సంబంధించినంత వరకు మనకిప్పుడు లభ్యమగుచున్నవి మాధ్యందిన, కణ్వసంమితలు రెండు మాత్రమే. వీనిలో మాధ్యందిన సంమిత మిక్కిలి ప్రసిద్ధము. దీనినే 'వాజసనేయసంహిత' అనికూడ అందురు.

ఇది 40 అధ్యాయముల గ్రంథము. ఇది 303 అనువాకములుగాను 1975 కండికలుగాను విభజింపబడినది. కండికలే మంత్రములు. చివరి 15 అధ్యాయములను ఖిలాధ్యాయములని పేర్కొందురు. ఈ సంహితలోని మొదటి అధ్యాయమునకు ప్రజాపతియు, అంతిమాధ్యాయమునకు దండ్య-అథర్వణుడును ఋషులుగా చెప్పబడిరి. 100 అధ్యాయములుగల శతపథబ్రాహ్మణము ఈ సంహితకు సంబంధించినదే. ఈ మాధ్యందిన శుక్లయజుర్వేదమునకు ఉవ్వట, మహీధర, దయానందాదులు భాష్యములను రచించియుండిరి. మహర్షి దయానందకృత భాష్యమే ప్రామాణికమైనదని విద్వాంసులు ముక్త కంఠముగా పేర్కొనుచున్నారు.

'మనోమయ పురుషునకు యజుర్వేదం శిరస్సు, ఋగ్వేదం దోషిణపక్షం. సామవేదం ఉత్తరపక్షం. అథర్వవేదం పుచ్ఛం' అని తైత్తిరీయోపనిషత్తు తెలియజేస్తుంది. 'సర్వస్య గాత్రస్య శిరః ప్రధానం' అనడం చేత యజుర్వేదానికి గల ప్రాధాన్యం బోధపడుతుంది.

**వైశిష్యం :**

అనాది నుండి భారతీయులు ఆధ్యాత్మికతత్త్వజిజ్ఞాసచేస్తూనే ఉన్నారు. వేదాలు వీరికి పరమ ప్రమాణాలు. అందులో యజుర్వేదం భిత్తిస్థానీయం అంటే ఇంటికి గోడలాగా యజ్ఞక్రియలలో ఉపయోగించే ప్రధానవేదం.

యజుర్వేదం ప్రారంభమే యజ్ఞప్రాశస్త్యములో జరిగినది. అనేకములైన గోవులను పాలించాలని తద్వారా వచ్చు ఘృతముతో శ్రేష్ఠకర్మలైన అనేకవిధ యజ్ఞయాగాదులను చేయాలని నాంది - ప్రస్తావన చేసింది.

**వసోః పవిత్రమసి ద్యౌరసి పృథివ్యసి ఘర్మోఽసి**
**విశ్వధా అసి పరమేణధామ్నా దృంహస్వ**
**మాహ్వార్మాతే యజ్ఞపతి ర్హ్వార్షీత్** - యజు.1-2

యజుర్వేదం మొదటి అధ్యాయం రెండవ మంత్రము యజ్ఞ మహత్వాన్ని తెలుపుతున్నది. "ఓ మానవులారా! ఈ వసువు అంటే యజ్ఞము చాలా పవిత్రమైనది. యజ్ఞోవై వసుః (శతపథ బ్రాహ్మణం) ద్యులోకం వలె విశాలమైనది. దీనిలో వేయబడిన ఆహుతులు సూర్యరశ్మిలో చేరి ప్రాణులకు ఉపకారం చేస్తాయి. వాయువులో చేరి కాలుష్యాన్ని నివారిస్తాయి. అన్నిటిని శుద్ధిచేసి వాటిని ధరిస్తాయి. ఇట్టి శ్రేష్ఠమైన యజ్ఞాన్ని మీరు విడువవద్దు. మీరు యజ్ఞపతులు

కండు. ఇది మీకు శతవిధాల ఉపకారం చేస్తుంది.''

యజ్ఞంలో వేయబడిన ఓషధులు భూలోకములోనున్న అగ్నిద్వారా అంతరిక్షములో నున్న వాయువులో కలిసి ద్యులోకములోనున్న ఆదిత్యుని చేరుతాయి. తిరిగి అదే మార్గంలో ప్రయాణించి మేఘాలద్వారా వర్షించి భూలోకమును చేరుతాయి. స్వచ్ఛమైన జలము బలవర్ధకములైన ఫలాలను, పంటలను అందిస్తాయి. అగ్నిహోత్రాన్ని వ్రతంగా స్వీకరించుటతోపాటు సత్యాన్ని కూడా వ్రతంగా స్వీకరించమంటుంది వేదం.

ఓ అగ్నీ! జ్ఞానప్రకాశకా! వ్రతపాలకా! నేను సత్యవ్రతమును చేయసంకల్పించితిని. దానిని ఆచరించు శక్తిని నాకు ప్రసాదింపుము. దానితో విద్యావిజ్ఞానాదులను పొంది ప్రకాశింతును గాక! అసత్యమునుండి, అసత్యవ్యవహారమునుండి, అజ్ఞానమునుండి విడివడి సత్యమును, సత్యవ్యవహారమును జ్ఞానమును పొందుదునుగాక!.

'యజుర్యజనాత్' యజ్ఞయాగాది కర్మకాండను నెరవేర్చడం వలన యజుర్వేదమయ్యింది. వేదార్థజ్ఞానానికి యజ్ఞానుష్ఠానమే ప్రయోజనం. యజ్ఞంలో యజుర్వేదమే ప్రధానమైనది. ఇది వేదమూర్ధన్యమనడానికి 'యజ్ఞస్య మాత్రాం మిమిమీత ఉత్వః' అని ఋగ్వేదం సాక్ష్యం పలుకుతున్నది. ఋగ్వేదంలో అధ్వర్యుడు 'సుహస్త్య' 'మధుపాణి' అని పిలువబడ్డాడు. 'అధ్వరం యునక్తీత్యధ్వర్యుః' అకారలోపంతో 'అధ్వర్యుః' అంటే యజ్ఞానికి 'నేత' అని అర్థం.

యజ్ఞంలో అందరి పనులను సక్రమంగా సవరించుకుంటూ నడిపించేవాడు అధ్వర్యుడు. అతడు యజుస్సులను పఠిస్తాడు. కాబట్టి యజుర్వేదానికి 'అధ్యర్యువేదమ'ని కూడా పేరు. యాగాన్ని నడిపించే బాధ్యత అధ్వర్యునిదే. కర్మకాండవిషయంలో యజుర్వేదానిదే ప్రాధాన్యత. కర్మల స్వరూపం యజుర్వేదంలోనే ఉంది. కనుక సకల యజ్ఞకలాపానికి ఆధారభూతమైనది.

40 అధ్యాయములు గల ఈ యజుర్వేదం 1-39 అధ్యాయములవరకు కర్మకాండను బోధించగా 40వ అధ్యాయం బ్రహ్మజ్ఞానాన్ని బోధిస్తున్నది. కర్మకాండతో ప్రారంభమై బ్రహ్మకాండతో ముగిసింది. బ్రహ్మకాండకే ప్రాథమ్యం అంగీకరించాల్సి వున్నా చిత్తశుద్ధిలేని మనిషికి బ్రహ్మకాండలో అధికారం లేదు. కాబట్టి చిత్తశుద్ధి రూపమైన అధికారాన్ని సంపాదించడానికి కర్మలను బోధించాలి. కనుక కర్మకాండ మొదట చెప్పబడింది.

* అద్దంలో కనిపిస్తున్న నక్షత్రాలను పట్టుకోవాలనుకుని ప్రయత్నించే పసివాడి మాదిరి విషయానుభూతిలో ఆనందాన్ని వెతికే మనిషి కూడా చివరకు నిరాశనే పొందుతాడు.

* భగవంతుని దర్శించాలంటే మనం చెల్లించాల్సిన ముడుపులు మూడు న్నాయి. అవి విషయవాసనలతో కలుషితంకాని మనస్సు; పరనింద, అసత్యాలతో దూషితం కాని వాక్కు; పరపీడన, పాపకార్యాలతో మలినం అంటని దేహం.

* కోరికలనే కలుపు మొక్కలను వైరాగ్యమనే కొడవలితో త్రుంచివేయ గలిగిన వాడు మాత్రమే జీవితమనే పైరు ద్వారా ఆనందమనే పంటను పొందగలడు.

శ్రీ విరాట్ పోతులూరి
వీరబ్రహ్మేంద్ర స్వాములవారి
రచనల్లో విశిష్ట రచన

# వీరకాళికాంబా శతకము

భావచ్ఛందోऽనుసరణ:
కీ.శే. డా॥ వి.వి.యల్.నరసింహారావు
(కందిమల్లయ్యపల్లె) బ్రహ్మంగారి మఠం
ఆస్థాన కవి

## కరుణ - మతము

**వ్యర్థమగుట కూడ దర్థంబు ప్రాణంబు**
**కర్త భోక్త గురుడు కలడు నీకు**
**స్మరణకొంచెమైన కరుణ నిండుగ నుండు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 394**

ధనము, జీవము వృథ కాగూడదు. ఈ అర్థప్రాణాలు వ్యర్థమైన తరువాత మనం ఎందుకూ కొఱగాము. మనల్ని ఈ విషయంలో కాపాడేందుకు గురుడున్నాడు. ఆయన పనిచేయగలడు. చేయించగలడు. అనుభవశాలి. ఆ విధంగా ఆయన మనకు కర్త, భోక్త. ఆయనను కొంచెం స్మరించుకొన్నా, ఎంతో దయతో మనల్ని కాపాడుతాడు. గుండె నిండా కరుణ గల దయాశాలి.

**కరుణ కలుగువాడె కలిమి కల్గినవాడు**
**కరుణలేనివాడు కటికపేద**
**గురుని కరుణ కూడ హరియించు కవి కొంత**
**కాళికాంబ! వీరకాళికాంబ! 395**

ధనమున్నవాడే సంపన్నుడనుకోవద్దు. దయకలవాడే నిజమైన సంపన్నుడు. దయలేనివాడు నిష్ఠదరిద్రుడు. అయితే గురువు గొప్పదయాశాలి కదా! ఆయన కూడ ఒకోసారి నిర్దయగా కనిపిస్తాడు. ఎందుకో! మరేం లేదు. అది కలిమాయ. 'కలి'పురుషుడు గురుదేవుని గుండెలోని కరుణను కూడా హరిస్తాడు. గురుశిష్యులిద్దరు కలిమాయ నుండి బయటపడి కరుణామూర్తులు కావాలి.

**బ్రతుకు త్రోవ యిదియె వెతికెడి వానికి**
**బుద్ధిమంతులకును పుణ్యులకును**
**ఋతువు బట్టి కాలగతి సాగిపోవును**
**కాళికాంబ! వీరకాళికాంబ! 396**

కపటంతో నిండిన కలియుగంలో కూడా జీవిత సన్మార్గం వెదకుకొనే బుద్ధిశాలులకు, పుణ్యమూర్తులకు ఆ సన్మార్గం తప్పక దొరుకుతుంది. కాలం ఋతు లక్షణాన్ని బట్టి సాగిపోతుంది. వసంత గ్రీష్మ వర్షాశరత్ హేమంత శిశిరాల ననుసరించి కాలగమనం ఉంటుంది. దాని ననుసరించుకొని జీవనమార్గం వెదకుకోవాలి. అట్లా వెదకుకొనువారే బుద్ధిశాలులైన పుణ్యులు.

**మనుజు లందఱేక మతమంచు తలచుమీ**
**హతములౌ నకృత్యతతుల కెల్ల**
**మతము తత్త్వ మెఱుగుమా, చావు లేకుండు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 397**

మతమంటే అభిప్రాయం. సర్వమానవులూ ఏకాభిప్రాయులు కావాలి; అయ్యేటట్లు చూడాలి. చూస్తే చేయకూడని అకృత్యాలు నశించిపోతాయి. మతము యొక్క స్వభావం తెలుసుకో. అది తెలిస్తే మానవుడు మృత్యువును జయించినట్లే. మతతత్త్వపు నిజస్వరూపం తెలిస్తే మనిషి మృత్యువును జయించినట్లే. ఇది చెప్పినంత తేలిక కాకపోవచ్చు. అయినా చిత్తశుద్ధితో సాధించాలి. ఇదే గురుదేవుని సద్బోధ.

**చావులేనివాని సేవచేసినగాని**
**పాయవు గద సర్వపాతకములు**
**అతడొకండె యెఱుగు నాయువుమర్మంబు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 398**

మనిషి చేసిన పాపాలు హరించాలంటే మనిషి

కంటే అధికశక్తి గలవాని నాశ్రయించాలి. మనిషి మర్త్యుడు. అమర్త్యుడైన దివ్యుడొక్కడే మర్త్యుణ్ణి రక్షించగలడు. ఆయువు రహస్యం అమరుడికి తెలిసినట్లు మర్త్యుడికి తెలియదుగదా! మనిషి అమరుడు కావాలంటే ఏ మార్గం అన్వేషించాలో సూచిస్తున్నాడు గురుదేవుడు.

**పుట్టిగిట్టువాని పుట్టించె దైవంబు**
**ఎఱుగకుండ ముంచె ఏటి నడుమ**
**వట్టి భ్రమలు చెంది పట్టువడగనేల?**
**కాళికాంబ! వీరకాళికాంబ! 399**

మనిషి అమరుడు కాడు. పుట్టటంతో పాటు గిట్టటం ఉన్నంత వరకు అతడు అమరుడు కాలేడు. భగవంతుడు జీవుల్ని సృష్టించేటప్పుడే ఈ పద్ధతిగా సృష్టించాడు. మరణించే సమయం దేవుడికి తెలిసి ఉన్నా జీవుడికి తెలియదు. నేను చిరంజీవిని అని అనుకుంటూ భ్రాంతిలో పడి ఎన్నో పనులు మొదలు పెడతాడు. కొన్ని పనుల్లో తాను కృతకృత్యుడు కాలేక చిక్కుల్లోనూ చిక్కుకోవచ్చు. వట్టివట్టి ఆశలతో భ్రమపడి ఇట్లా చిక్కులు తెచ్చుకోవద్దని గురుదేవుని హెచ్చరిక. మృత్యువు నట్టేటి చందంగా కనిపించి దేహిని అందులో ముంచెయ్యటం అందరం చూస్తూనే ఉన్నాం. అది జీవులందరికీ అనివార్యమే.

**యముని వెంట చనగ సమయచింతన మేల?**
**జంట విడక గురుని వెంట చనుట**
**జుంటితేనెగ్రోలి జున్ను సేవించుటే**
**కాళికాంబ! వీరకాళికాంబ! 400**

యముని వెంట బలవంతంగా పోవలసిరావటం మృత్యువు సమీపించటం వల్లనే కదా! మిత్తి నెత్తి మీది కెక్కినప్పుడు 'ఇప్పుడు వెళ్లవచ్చునా? వెళ్లకూడదా?' అనే సందేహం రావలసిన పనిలేదు. అది మన చేయి దాటిపోయినస్థితి. కాకపోతే ఉన్నంతలో గురుదేవు నాశ్రయించటం ఒక మార్గం. గురుదేవుడు నరకం తప్పించే మార్గం ఆలోచించగలడేమో! గురుని సన్నిధి మహామధుర మైనది. తేనెటీగలు కూర్చిన తియ్యని తేనె త్రాగి వెంటనే కమ్మని జున్నుపాలు త్రాగుతుంటే ఎంత ఆనందంగా వుంటుందో గురుదేవు ననుసరించి జీవరహస్యం తెలుసుకోవటం కూడా అంత ఆనందంగా ఉంటుంది.

**సత్యగురుని కరుణ స్వప్నమందొదవిన**
**అతడు బ్రహ్మవోలె అవని వెలుగు**
**తనకు నెఱుకలేక తత్త్వమెట్లౌనురా**
**కాళికాంబ! వీరకాళికాంబ! 401**

నిజమైన గురువు యొక్క దయ సిద్ధిస్తే ఆ గురువు శిష్యుడికి బ్రహ్మవలె గోచరిస్తాడు. కలలో బ్రహ్మమును చూచినట్లే - బ్రహ్మానందం కలుగుతుంది. అయితే కలలో కనిపించిన గురుదేవుని ఆశయాదర్శాలు గ్రహించి వాటిని ఆచరణలో పెట్టకలిగితేనే జ్ఞానం లభిస్తుంది. జ్ఞానం లేకుండా సిద్ధాంతం నిరూపించటం సాధ్యమా? ఎఱుక కలిగి తత్త్వాన్ని రూపొందించుకోవాలి.

**అప్పడాతడుండు అచ్చోటు తెలియదు**
**రెప్పపాటులోన చెప్పగలరే?**
**ఇప్పడెఱిగియున్న ఎప్పటి కెఱుకయే**
**కాళికాంబ! వీరకాళికాంబ! 402**

సత్యగురువులు సంతలో దొరికే వంటి వారు కారు. నిజమైన గురువును వెదకి పట్టుకోవటమే ఒకబ్రహ్మ ప్రయత్నం. ఈవేళ అక్కడ కనిపించిన ఒక గురువు సత్యగురువే అనుకొంటే సత్యగురుస్థానం అదే అనుకోవటానికి వీలుండదు. క్షణంలో దాన్ని గుర్తించటం సాధ్యం కాదు. ఒకవేళ సాధ్యమైతే ఇప్పుడు కలిగిన జ్ఞానం - శాశ్వతజ్ఞానమే అనుకోవచ్చు.

వయసుపైబడినా జ్ఞానం నూతన బలాన్నిస్తుంది. ద్రవ్యం లేకపోయినా జ్ఞానసంపద ధైర్యమిస్తుంది. కనుక సద్గురు నన్వేషించటం శిష్యసత్తముని కర్తవ్యం.

**ముప్పుతప్పలేదు, అప్పు ముప్పును దెచ్చు**
**అప్పుసప్పులేని గొప్పపదవి**

**అలవికాని పదవి అది మహాగోప్యంబు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 403**

'ముప్పు' అంటే ముసలితనమనీ, ప్రమాదమనీ రెండర్థాలు. ముసలితనం రావటం తప్పులేదు. అది సహజంగా వచ్చేదే. అప్పు అటువంటిదికాదు. అది ప్రమాదం తెస్తుంది. అప్పుతీర్చలేనివాడు అవమానాల పాలు కాక తప్పదు. 'అప్పు సప్పు' - అంటే బాకీ మొదలైనవి లేకపోవటమే ఒక గొప్పపదవి. ఉన్నత స్థితి. అది అందరికీ సాధ్యం కాని రహస్యమైన గొప్ప స్థితి. మనిషి అప్పుల పాలుకాకూడదని గురుదేవుని అభిప్రాయం.

**ఎన్ని మతముల గన నేమి కనంబడు?**
**కంటిపాపలోనె కలదు మచ్చ**
**మనసు నందు లేక మతము నందేముండు?**
**కాళికాంబ! వీరకాళికాంబ! 403**

లోకంలో అనేక మతాలున్నాయి. ఆ మతాల సిద్ధాంతాలు అనేకం. అందులో కొన్ని మనకు తప్పులా కనిపించవచ్చు. తప్పుకానివి కూడా తప్పులా కనిపిస్తాయి. అప్పుడు మన దృష్టిలోనే దోషం ఉందని గ్రహించాలి. 'కంటిపాపలోనె కలదు మచ్చ' అంటే అది అభిప్రాయం; ఏదైనా మన మనస్సునే శుద్ధం చేసుకొని చూడాలి. మనసులో లేనిది మతంలో ఏముంటుంది? అనే గురుదేవుని ప్రశ్నకు అర్థం అది.

**మనసు స్వచ్ఛమైన మంచు వంటిది గదా!**
**దినుసు దినుసు మనసు త్రిప్పనేల?**
**మనసు గన్నయపుడె దినుసు తెల్లంబగు**
**కాళికాంబ! వీరకాళికాంబ 404**

మనసు మాలిన్యంలేని తెల్లని మంచు వంటిది. లోకంలో ఎన్నోదినుసు లున్నాయి. ఇవి పదార్థాలు ఒక్కొక్క పదార్థం మనస్సును ఒక్కొక్క విధంగా పరిభ్రమింప జేయవచ్చు. మనస్సుకు మాలిన్యం అంటనంత వరకు అన్ని పదార్థాలు వాటి సహజ స్వరూపంలో కనిపిస్తాయి. మాలిన్యం అంటి తేనే. ప్రమాదం. పదార్థానికి మాలిన్యం అంటవచ్చు. మనస్సుకు మాత్రం అవి అంటకూడదు. మనస్సు నిష్కల్మషంగా ఉండాలన్నది గురుదేవుని ఆదేశం.

**మనసు సంద్రమౌర! మతిలోతు తెలియదు**
**దాటిపోవు నలలు తన్ను మించి**
**అలల నడుపు చేయు నాతడే గుతికాడు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 406**

మనస్సు అగాథమైన సముద్రం వంటిది. అందులో చెలరేగే అలలు - మానవుని అదుపు తప్పి అతన్ని అల్లకల్లోలం చెయ్యవచ్చు. అదుపు తప్పకుండా మనస్సును తన అధీనంలో ఉంచుకోగలవాడే లక్ష్యశుద్ధి గలవాడు. గుతికాడని అతన్నే మనం అంటాము. మనస్సును సంయమం చేసుకోగలవాడు సాక్షాత్తు సంయమి. సంయమ లక్షణం అలవరుచుకోవటమే సాధకుడు నేర్చుకోవలసిందని గురుదేవుని అభిప్రాయం.

**దేహపృథివి గుణము తేటపడుగుణము**
**మాటిమాటి కదియు మారుచుండు**
**పుట్టుతావు మార బుద్ధులు మారవా?**
**కాళికాంబ! వీరకాళికాంబ! 407**

మన శరీరం ప్రధానంగా పృథివీ గుణం కలది. కనుకనే చివరికిది మట్టిలో కలిసిపోతుంది. మట్టి కూడా అన్ని తావులా ఒక విధంగా ఉండదు. కొన్ని తావుల్లో సారవంతమైన మట్టి ఉంటుంది. కొన్ని తావుల్లో బీడుపడి ఉంటుంది. దేహి జన్మస్థానమైన నేలను బట్టి దేహి బుద్ధులు, గుణగణాలు మారుతుంటాయి. భారతదేశపు గడ్డ మీద పుట్టిన వారికీ తక్కినవారికీ సంస్కారాదుల్లోనే ఎంతో బేధం కనిపిస్తుంది కదా! మాతృభూమి లక్షణం సర్వులకూ అనివార్యమే!

(ఇది ఒక విధంగా తాత్త్విక లక్షణమే. తత్త్వలక్షణం తెలిస్తేకాని తత్త్వసిద్ధి కలుగుదు. అదే చెప్పబోతున్నాడు గురుదేవుడు వచ్చే 27 పద్యాలలో.)

# ఆది గురువు ఆచార్య శంకరులు

- శ్రీమతి జానమద్ది స్వర్ణలతా జోషి

(గత సంచిక తరువాయి)

**శివ గురువు వివాహం :**

కొడుకు విద్యా పరిజ్ఞానాన్ని పరిశీలించిన విద్యాధిరాజుకు ఎనలేని సంతోషం కలిగింది. వేదాధ్యయన, పద, క్రమ, జటా, ఘనపాఠములు, శాస్త్రాధ్యయనము, సదాచారము, శ్రౌతస్మార్తకర్మలకు అవసరమైన జ్ఞానము, ధర్మజిజ్ఞాస మొ॥ వాటిని పరీక్షించి తృప్తి చెందాడు.

ఆ తరువాత ఆయనకు తన కొడుకును గృహస్థుడిగా చూడాలన్న కోరిక కలిగింది. వేదవాణి ప్రకారం తండ్రి తన కొడుకును ప్రయోజకునిగా, తీర్చిదిద్ది, వివాహము చేసి మనుమడు పుట్టిన తరువాత వైరాగ్య జీవితాన్ని గడపాలి. కుల-శీల-వయో విద్యా- రూప - సౌభాగ్య -సదాచార సంపన్నురాలైన 'ఆర్యాంబ' అనే కన్యామణిని చూచి పుత్రుడి వివాహాన్ని జరిపించారు. 'ధర్మప్రజాసంపత్యర్థం ప్రియముద్వహే '(ధర్మ సంతానం కోసం స్త్రీని వివాహం చేసుకుంటారు) అన్న పెళ్లినాటి ప్రమాణం శివగురువుకు సంకల్పబలంగా మారింది. పెళ్ళిలో పురోహితుడు చెప్పించిన 'ఆవాఖ్యాం, కర్మాణి కర్తవ్యాని' (ఇక మీదట మనమిద్దరం కలసి గృహస్థాశ్రమ ధర్మాలను నిర్వహించుదాం) అన్న వాక్యం ఆయనకు కర్తవ్యాన్ని గుర్తుచేసింది. గురుకులంలో వేదాధ్యయనం చేసి, ఇప్పుడు గృహస్థాశ్రమంలో వేదొక్త కర్మలను practicals నిర్వహించాలని హెచ్చరించింది. వధువుచేత 'ప్రజాశ్చ ఉత్పాదయితవ్యాః' (సంతానం పొందాలి) అని చెప్పిస్తారు. పుత్రోత్పత్తి ఆలస్యమైతే తపస్సు యోగసాధనంచే సుపుత్రుని పొందాలని చెప్పబడింది. మొదటి సంతానం ధర్మసంతానమని అనంతరం కలిగే వారు కామ సంతానమని చెప్పబడింది. శివగురువు గృహస్థ జీవితం ధర్మహాని కాకుండా జరుగుచుండుటచే ఆ దంపతుల ద్వారా 'ఆదిగురువు' భూలోకంలో అవతరించాలని సంకల్పించాడు.

**ఆచార్యుల జననము - బాల్యము - విద్యాభ్యాసము**

ఆర్యాంబ, శివగురువు దంపతులకు చాలా కాలం సంతానము కలుగలేదు. 'పుత్రుడి ద్వారా లోకాన్ని జయించవచ్చు' అంటుంది వేదం. అంటే తాను బ్రతికి వున్నప్పుడు ఏదేవతా కార్యములను, ధర్మకార్యాలను, కులాచార వ్రత నియమాలను పాటించాడో అవి తన తరువాత కూడా కొనసాగాలంటే గుణవంతుడైన పుత్రుని పొందాలి.ఆ దంపతులు భక్తులకు కల్పవృక్షమైన శివుని శరణు వేడితే పుత్ర సంతానం కలుగుతుందన్న ఆశాభావంతో వృషబాద్రి వాసుని గురించిన తపస్సు ప్రారంభించారు. ఇందులో సత్సంతానాన్ని పొందగోరిన దంపతులు, వ్రతం, నియమ తపస్సులను ఆచరించాలన్న సందేశం దాగివుంది. వారి తపస్సుకు మెచ్చిన శివుని మనసులో కూడ తాను వారి ద్వారా అవతరించాలన్న సంకల్పం దృఢపడ సాగింది. కాని పుత్రసుఖంలోన పూర్ణఫలం ఆ దంపతులకు లేదని తెలిసి తానే బ్రాహ్మణ వేషంలో శివగురువుకు కలలో కనిపించి 'సర్వగుణోపేతుడైన ఒక్క పుత్రుడు కావలెనా లేక చాలాకాలం బ్రతికే సామాన్య సంతానం కావలెనా ?' అని అడిగాడు. అందుకు శివగురువు 'కులభూషణుడు అయిన,

సర్వజ్ఞుడైన ఒక్క కొడుకే చాలు' అని జవాబు చెప్పాడు.

శివగురువు జవాబు విన్న శివుడు 'ఇక నీ తపస్సు చాలించు. పరమేశ్వరుడు నీకు పుత్ర సంతానన్ని అనుగ్రహించాడు' అని చెప్పి మాయమయ్యాడు. స్వప్నవృత్తాంతాన్ని శివగురువు తన భార్యకు తెలిపాడు. వ్రత నియమాలను పూర్తిచేసిన ఆ దంపతులు గృహస్థ ధర్మం ప్రకారము జీవితం గడపసాగారు.

**ఆర్యాంబ గర్భధారణ** : ఛాందోగ్యోపనిషత్తులో 'పంచాన్ని విద్యా' అనే ప్రకరణం వుంది. అందులో స్త్రీ-పురుషులిద్దరూ అన్ని సమానులని, పురుషుడు యోషాగ్నిలో రేతస్సన్ను హోమ మాడువుదరింద సత్సంతానము కలుగునని, పుణ్యశేషం వలన పుట్టబోయే పురుషులు తమ జన్మ సమయంలో ఇలాంటి ఉపాసకులను ఆశ్రయిస్తారని వివరంపబడింది. పుట్టబోయే పుణ్యజీవులు పురుషుడు తినే అన్నం ద్వారా అతనిలో ప్రవేశించి, ఋతుకాలంలో స్త్రీ గర్భంలో ప్రవేశించి జన్మిస్తారని వర్ణింపబడింది. ముండకోపనిషత్తులోను దీనినిగురించిన వివరణ వున్నది. అలాగే ఒక శివగురువు భోజన సమయంలో ఆయన తినే అన్నంలో శివ తేజస్సు గోప్యంగా వచ్చి చేరి, రేతస్సు రూపంలో ఆర్యాంబను చేరింది. ఆమె గర్భవతి అయింది. పరశివుని అంశాన్ని ధరించడం చేత ఆమె తేజస్సు పెరగసాగింది తన తపస్సు ఫలించిందని శివగురువు సంతోషపడ్డాడు. ఆమెకు విచిత్రమైన కలలు వచ్చేవి. తాను ఎత్తైన తెల్లటి కొండపై విహరిస్తుండగా గంధర్వ విద్యాధరులు తనచుట్టూ చేరి జయఘోష చేస్తున్నట్లుగా అనిపించేది. అలాంటి భావనలలోనే తొమ్మిది నెలలు గడిచిపోయాయి.

**శ్రీ శంకరుల జననము** : ఆర్యాంబ సుపుత్రుని పొందనున్న శుభదినం రానే వచ్చింది. ఆస్తికుల విశ్వాసం మేరకు అనాడు వైశాఖ శుక్ల పంచమి ఆరుద్ర నక్షత్రం గ్రహాలలో సూర్యుడు, అంగారకుడు, శని క్రమంగా మేష, మకర తులా రాశులలో, ఉచ్ఛస్థితిలో వున్నారు. గురువు కేంద్రస్థానంలో వున్నాడు. (శంకర అన్న పేరులోనే ఆచార్యుల జన్మకాలం దాగి వుంది 'శ' అన్నది అవర్గీయ వ్యంజనాక్షరములలో ఐదవది. అందువలన అది 'పంచమి' తిథి. అలాగే 'క' అన్నది వర్గీయ వ్యంజనములలో మొదటిది అంటే 'శుక్లపక్షము'. 'ర' అన్నది అవర్గీయ వ్యంజనములలో రెండవది అది రెండవదైన వైశాఖ మాసమును సూచిస్తుంది. ఇలా వైశాఖ -శుక్ల-పంచమి నాడు 'శంకర' అన్న పేరులోనే ఆయన జన్మదిన సంకేతం దాగివుందని కొందరి అభిప్రాయం). ఆ దినం శుభలగ్నంలో శ్రీ పార్వతీదేవి కుమారస్వామిని లాగా ఆర్యాంబ కూడా మగ పిల్లవాడిని ప్రసవించింది. ఆ శుభవార్త విన్న శివగురువు వెంటనే సచేలస్నానము చేశాడు. బ్రాహ్మణులకు దానధర్మాలు చేశాడు చాలా సంతోషపడ్డాడు. మహాత్ముల ఆగమనంతో ప్రకృతి పులకించింది. వైర జంతువులైన ఆవు-పులి, ఏనుగు-సింహము, పాము -ఎలుక కూడా అన్యోన్యంగా సంచరించసాగాయి. చెట్లు, వృక్షాలు ఫలపుష్ప వర్షం కూడ కురిసింది. ద్వైతవాదుల చేతులలోని వాద గ్రంథాలు చేయి జారాయి. దేవతలు సంతోషపడ్డారు. మేఘాలు చిరుజల్లు కురిశాయి. ఇలా ప్రకృతి ప్రసన్నమై మహాత్ముని జననాన్ని ప్రచారం చేసింది. శివగురువు కొడుకుకు జాతకర్మలు చేశాడు. తండ్రి తన కొడుకును ఒడిలో పడుకోబెట్టుకొని వేదమంత్రాలతో అభిమంత్రించి 'ఆత్మావై పుత్ర నామాసి' అని చెబుతూ తేనె, నెయ్యి, పెరుగును విడివిడిగా ఆచిన్నవాడి నాలుకపై రాసి రుచి తెలియజేస్తారు. తరువాత తల్లి పాలుపడుతుంది. బియ్యపు తవుడు, తెల్ల ఆవాలతో హోమం చేసి సూతికా గ్రహంలోకి క్షుద్రదేవతలు రాకుండా కట్టడి

చేస్తారు. అప్పుడు తల్లీ - బిడ్డ ఇద్దరూ బాగుంటారు. శివగురువు ఈ విధి నియమాలన్నింటినీ అనుసరించాడు. శాస్త్రజ్ఞుడు, కర్మఠుడు అయిన శివగురువు జాతకర్మలను సకాలంలో ముగించి నామకరణానికి సిద్ధమయ్యాడు.

**నామకరణం :** పుట్టిన బిడ్డకు నామకరణం చెయ్యడం కూడా ముఖ్యమైన సంస్కారమే. బిడ్డ పుట్టిన తరువాత పదకొండు లేదా పన్నెండవ దినం ఇందుకు ప్రశస్తమైనది. మిగిలిన దినాలు సాధారణం చక్కటి సంస్కారాలు రావాలంటే శుభదినాలలోనే శుభకర్మలు చేయాలి. విత్తనాలు సకాలంలో వేస్తేనే కదా సరియైన పంట సమృద్ధిగా లభిస్తుంది. వ్యవహారం కోసం నామకరణం చేసినప్పటికీ, బిడ్డ పెరిగి పెద్దవాడయ్యాక ఆ పేరుయొక్క ప్రాబల్యం తెలుస్తుంది. ఆ వ్యక్తి కీర్తి గడిస్తే ఆ పేరు సార్థకమవుతుంది. ఇవన్ని ఆలోచించే పెద్దలు నామకరణం చేస్తారు. ఆ పేరు వారి స్వభావము, రూపము గుణాలకు తగినట్లుగా వుండాలి. శివగురువు తనకు పరమేశ్వరుడే పుత్రుని అనుగ్రహించాడని సంపూర్ణంగా నమ్మాడు. చూచిన వారికి ఆ బిడ్డ ఆనందాన్ని కలిగించడం వలననూ, ఈశ్వరాంశ సంభూతుడైన ఆ బిడ్డకు పరమేశ్వరుని ప్రియనామము, రుద్రాధ్యాయ ప్రతిపాదితమూ అయిన 'శంకర' అని నామకరణం చేశాడు. ఇలా శ్రీ శంకరుడు శిశువుగా చూపరులకు ఎంతో ఆనందాన్ని కలిగించాడు. తలపై చంద్రరేఖ, నుదుటిపై మూడవ కన్ను, చేతిలో త్రిశూలము యొక్క చిహ్నములు కలిగి స్ఫటికం లాంటి మేనిచాయతో ప్రకాశించే ఆ బాలుని చూచిన వారందరూ అతడు ఈశ్వరాంశ సంభూతుడేనని భావించారు తల్లిదండ్రుల పెంపకంలో ఆ బాలుడు శుక్లపక్ష చంద్రునిలాగా దినదిన ప్రవర్థమానం కాసాగాడు.

**విద్యాభ్యాసము - ఉపనయనము :** శ్రీ శంకరులు మొదటి సంవత్సరంలోనే స్పష్టంగా మాట్లాడటం మొదలు పెట్టాడు. రెండవ సంవత్సరంలో వ్రాయబడిన దానిని గుర్తుపట్టి చదువగలిగాడు. ఆ చిన్నవాడికి ఇతిహాస, కావ్య పురాణాలంటే ఎనలేని ఆసక్తి. ఏక సంధాగ్రాహి అయిన ఆ విద్యార్థికి చదువు చెప్పడం గురువులకు ఏమాత్రం కష్టంకాలేదు. అలా కొడుకు పురోభివృద్ధిని చూచిన శివగురువుకు మూడవ ఏట చూడాకర్మను, ఆ తరువాత సకాలంలో ఉపనయనాన్ని చేసి తానే గురువై వేదశాస్త్రాలను నేర్పే అదృష్టం లేకపోయింది. ఎందుకంటే వయోధర్మం చేత శంకరుడి మూడవ ఏటనే ఆయన పరమపదించాడు. ఆర్యాంబయే శంకరుడికి తల్లీ మరియు తండ్రియై పోషించింది. బిడ్డడిలోని విద్యాశక్తి, ప్రజ్ఞాశక్తి, మేదాశక్తిని గమనించిన తల్లి వయసుకు తగినట్లు ఉపనయనం చేసి వేదశాస్త్ర అధ్యయనం చేయించాలని ఉబలాట పడింది. అంతలోనే శంకరుడికి ఐదేళ్ళు నిండాయి.

బ్రాహ్మణ వటువుకు ఎనిమిదేళ్లకు ఉపనయనం చేయాలని శాస్త్రం చెబుతుంది. తరువాత గురుకులంలో వేదాధ్యయనము పూర్తిచేసి ధర్మజ్ఞానంను శాంతపరచుకోవచ్చు. గురుకుల విద్యాభ్యాసానికి పన్నెండేళ్ళు గడువు కాలము. ఇప్పటికీ ఈ నియమం పాటించడం జరుగుతూవుంది. శ్రీశంకరుడిలోని విద్యాగ్రహణ-ధారణా శక్తులను గమనించిన ఆర్యాంబ ఎనిమిదేళ్ళ దాకా ఆగలేకపోయింది. తేజోస్వరూపులకు వయోధర్మం ముఖ్యంకాదని వారికి తెలునం. విశేష సందర్భములలో ఐదవ ఏటనే ఉపనయనం చేయవచ్చుననే సత్యం ఆమెకు తెలుసు. తరువాత శుభ ముహూర్తం చూసి బిడ్డకు ఉపనయనం చేసి గురుకులానికి పంపించింది.

(సశేషం)

# యోగవాసిష్ఠ కథాలహరి

డా॥ ధారారామనాధశాస్త్రి, ఒంగోలు

## కామికాని మోక్షగామి దాశూరుడు

బాల్య యౌవన సంధి దశలో వైక్లబ్యానికి లోనైన రఘురాముని ఒక మహావీరునిగా, జ్ఞానిగా తీర్చిదిద్ది కర్తవ్య పథాన నిలిపి ఉత్తమ చక్రవర్తిగా రూపొందించడానికి గాను తన ప్రవచనాలద్వారా ప్రయత్నిస్తున్న శ్రీవసిష్ఠులు జ్ఞానోపదేశికము జగన్మిథ్యా తత్త్వ ప్రతిపాదికము అయిన ఒక విశిష్ట అఖ్యాయికను ఎన్నుకొని యిలా సెలవిస్తున్నారు.

రామా! భారతావనిలో మిక్కిలి ప్రసిద్ధము మగధ. ఆది కాలమున అనేకులు ధర్మమార్గ ప్రవర్తకులైన రాజర్షులు పరిపాలించిన ధర్మభూమి. ఆ పొంత రమణీయము ప్రశాంతము అయిన ఓ వనసీమలో శరలోముడు అనే మహర్షి చిరకాలంగా తపస్సు చేస్తున్నాడు. ఆ శరలోముని కుమారుడు దాశూరుడు. తండ్రిలాగే బ్రహ్మమార్గ ప్రవర్తకుడై తానున్నూ తీవ్ర తపస్సుచేస్తూ, తండ్రిని సేవిస్తూ బృహస్పతికి కచునిలాగ ఉత్తమ పుత్రునిగా విఖ్యాతుడై జీవిస్తున్నాడు. ఇలా కొంతకాలం గడిచాక వృద్ధుడైన శరలోముడు మరణించాడు. తండ్రి మరణంవల్ల ప్రగాఢ దుఃఖానికి గురియైన దాశూరుడు తండ్రిగారి జ్ఞాపకాలనే నెమరు వేసుకుంటూ, ఆయన కోసం చింతిస్తూ నిశ్చేతనుడై స్తబ్ధుడై కాలం వెళ్ళదీస్తున్నాడు. ఈ పరిస్థితి చాలాకాలం కొనసాగితే దాశురుని జీవితం వృధా అయిపోతుంది. జగత్తుకు లభించదగిన ఒక మహా తపస్వి యొక్క జ్ఞానం లభించదు. ఇలాంటి మహర్షులు తమ తపస్సును నిరంతరం విశ్వశ్రేయస్సుకోసం ధారపోస్తేనే కదా జగచ్చక్రము ధర్మబద్ధంగా భ్రమిస్తుంటుంది. ఎక్కడ ఎప్పుడు బ్రహ్మణ్యమూర్తుల తపస్సిద్ధికి లోకం దూరమవుతుందో అక్కడ అప్పుడు చీకటి, అజ్ఞానము, అధర్మము తాండవిస్తాయి. ధర్మం దెబ్బతింటుంది - అని ఆలోచించిన వనదేవతలు అదృశ్యమూర్తులై ముక్తకంఠంతో దాశూరుని ఇలా ప్రబోధించారు.

'మహాత్మా! మీరు జ్ఞాన సంపన్నులు. అటు తపోనిష్ఠచేత ఇటు మాతాపితృ సేవచేత పండిపోయిన మహానుభావులు. వయస్సున పిన్నవారైనా జ్ఞానంలో పెద్దవారు. అలాంటి మీకు మేము ఏమీ చెప్పదగిన వారముకాము. అయినా లోక శ్రేయస్సును కోరి చొరవ తీసుకుంటున్నాము. మీకు తెలియదా ఉదయించిన సూర్యుడు అస్తమించక తప్పదని, మరచారా జననమరణాలు సర్వప్రాణికి సహజములని, మేము చెప్పాలా, శరీరం మాత్రమే నశిస్తుందనీ ఆత్మ అవినాశి అనీ... ఆలోచించి వెంటనే పితృవియోగ దుఃఖాన్ని వదలి, మళ్ళీ తపశ్చర్యకు పూనుకొనండి. అది మీకూ లోకానికీ మేలు''. వనదేవతల ఉపదేశం విన్న దాశూరుడు విషాదాన్ని విసర్జించి, మనశ్శాంతి పొంది మళ్ళీ తపశ్చర్యకు పూనుకున్నాడు. రామప్రభూ! దాశూరుని తపస్సు ఈసారి మరింత ఉజ్జ్వలమై కొనసాగుతున్నది. కాలం గడుస్తున్నది.

ఓనాడు... అప్పుడే తపోనిష్ఠ విరమించి కన్నులు తెరచిన దాశూరుని ముందట ఒక అద్భుత సౌందర్యవతి నిలిచింది. వయ్యారాలు ఒలకపోస్తూ హొయలొలకపోస్తూ విన్యసిస్తూ చెంపకు చారడేసి

కళ్ళతో యువముని అందాన్ని తాగేస్తున్నట్టుగా చెంతచేరి తన వలుపు తలపునుతెలుపగా దాశూరుడు చిత్తవృత్తులను నిరోధించుకొని నిగ్రహం రాబట్టుకొని మరొకసారి తపోదీక్షను మనస్సుకు తెచ్చుకొని ఆమె కోరికను నిర్ద్వంద్వంగా నిరాకరించాడు. దుఃఖార్తయైన సుందరాంగి కంటనీరొలుకుతూ అన్నది. 'మీరు నిరాకరిస్తే నాకు మరణమే శరణము. అగ్నిప్రవేశము చేస్తాను సెలవు' - అని వెళ్ళబోతుండగా మనస్సు కరిగిన ముని 'ఇంతకీ ఎవరు నీవు' అని మెత్తగా ప్రశ్నించాడు. నేను వనదేవిని. కామాతురనై వచ్చాను కాదనకండి అన్నది. దాశూరుడు క్షణం ఆలోచించాడు. మనోనేత్రంలో తిలకించాడు. ప్రసన్నుడై 'దేవీ, ఈ పుష్పం స్వీకరించు. తలదాల్చు, అనతికాలంలో అసదృశ పుత్రుడు జన్మిస్తాడు' అనగా వనదేవి సంతోషంతో పుష్పాన్ని స్వీకరించి వెళ్ళిపోయింది. రామచంద్రా! కాలచక్రంలో ద్వాదశ వర్షాలు గడిచాయి. ఓనాటి ప్రాతఃకాలం వనదేవి దాశూర ఆశ్రమానికి వచ్చింది. వెంట పన్నెండేళ్ల బాలుడు ఉన్నాడు. సౌందర్యంతో, విశిష్ట సాముద్రిక లక్షణాలతో, విద్యావినయ తపస్సుతో విరాజిల్లుతున్న అతన్ని చూపి వనదేవి దాశూరునితో అన్నది. 'స్వామీ, వీడే మన పుత్రుడు. సమస్త విద్యలు నేర్పాను. మీకు అప్పజెబుతున్నాను. సర్వ విద్యా సారమైన ఆత్మజ్ఞానాన్ని అనుగ్రహించండి. నా జీవితాశయం నెరవేరుతుంది. ఇకనుండి యితడు మీ నీడన వర్ధిల్లాలి.' అని అదృశ్యం అయినది.

రాఘవా! కథలో ఆంతర్యం గమనించావుటయ్యా, వనదేవి కథ గార్హస్థ్య ధర్మానికీ ప్రతీక. అరణ్యక ప్రకృతి విలాసమంతా సృష్టికేంద్రమైన ఒక స్త్రీ మూర్తిగా ఊహించు. దాశూరుడు తపశ్చర్యలో ఒక్కొక్క శిఖరమూ ఎక్కి మోక్ష సామ్రాజ్యాన్ని పొందితే లోకం ఏమికాను. అతని విద్యకీ, తత్త్వానికీ సాధనకీ ఓ వారసుడు జన్మించి పరంపరగా జ్ఞానామృతాన్ని లోకానికి కటాక్షించాలి కదా!

అందుచేత చేతనాత్మకమైన ప్రకృతి స్త్రీ రూపందాల్చి దాశూరుని దగ్గరకు వచ్చింది. దాశూరుడు మోక్షగామి. కామికాదు. అందుచేత సమన్వయ మార్గంలో ప్రసన్నమైన తన సంకల్పాన్ని పుత్ర జననము అనే ఆదర్శానికి అంకితం చేసి పుష్పరూపంలో అనుగ్రహించాడు. దీనిచేత శారీరక స్పర్శాపూర్వకమైన శృంగార విలాసము, బంధము, అనుబంధము మొదలైన సంసారిక జంజాటంలో బంధితుడు కాకుండానే వారసుని పొందాడు.ఇ దొక లోకానుగ్రహ చర్య. మహాత్ముల చరిత్రలు వింతగా ఉంటాయి. అప్పటికే సమస్త విద్యలను అభ్యసించిన తన కుమారుని వనదేవి కోరికమేరకు దాశూరుడు ఆత్మజ్ఞాన బోధచేశాడు. రామచంద్రా! అందులో ప్రధానమైన విషయాలు ఎవరైనా ఎప్పుడైనా విని మననం చేసుకొని ధ్యానించి తరించ దగినవి. ప్రస్తుతం నీ మనస్తత్త్వానికి ఉపకారమైనవి. అవధానంతో వినవలసినది.

"సంకల్పక్షయమే మోక్షసాధనకి మొదటి మెట్టు. ఎప్పటి కప్పుడు మానవుని ఆక్రమించే అజ్ఞానము అనే మాలిన్యాన్ని బియ్యం పొట్టు తీసినట్లు, రాగి చిలుము తోమినట్లు నిరంతర సాధనచేత నశింపజేయాలి. ఈ దృశ్య జగత్తులేదు అని గట్టిగా నిశ్చయించుకుంటే చాలు. ఇక ఆసక్తి అంటూ కలుగదు. వివేకవంతులకు లేని దాని మీద ఆసక్తి కలుగుతుందా ? కైలాసంలో గౌరీదేవి నాట్యాన్ని చూచి ఆనందించే శివునికి కొండచరియలమీద ఎగురుతూ దూకుతున్న కోతుల కదలిక మీద ఆసక్తి కలుగునా ? భూమి మృత్తిక, వృక్షములు కాష్ఠమయములు, దేహాలు

మాంసమయములు, క్రింద భూమి పైన ఆకాశము ప్రపంచంలో సుఖప్రదమైన చోటులేదు. కాబట్టి మిధ్యా జగత్తును నిరాకరించి విచారపరుడై జ్ఞానాన్నిపొంది తరించాలి.

**"కోహం కథమిదం జాతం, సంసారాడంబరం విభో**
**ప్రవిచార్య ప్రయత్నేన ప్రాజ్ఞేన సహసాధుభిః"**

ఉత్తములైన సాధు సత్పురుషులతో గూడి, సేవాది సత్కార్యక్రమముల ద్వారా గురువును ప్రసన్నం చేసుకొని 'ప్రభూ! నేనెవర్ని? నాకు ఈ సంసారాండబరమంతా ఎలా జనించింది. అని ప్రశ్నించాలి. గుర్వనుగ్రహంచేత ఉపదేశం పొంది సాధనచేయాలి.

**"బ్రహ్మచర్యేణ ధైర్యేణ వీర్యవైరాగ్య రంహసా**
**యుక్త్యాయుక్తేన హి వినానప్రాప్రోషి తదీహితమ్"**

"బ్రహ్మచర్యము, ధైర్యము, వీర్యము, వైరాగ్యము, వేగము, యుక్తి - అన్న లక్షణాలు లేకపోతే ఓ రామా! వాంఛితమైన పరమార్థపదం పొందజాలవు. బాగా ఆలోచించు. రేపు ఉదయం పునర్దర్శనం" అంటూ శ్రీవసిష్ఠులు ముగించారు. ▯

## డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారికి విశ్వభారతీ పురస్కారం

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల ప్రధాన సంపాదకులు, మాజీ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారికి కాశీక్షేత్రంలోని జంగమవాడి మఠసంస్థానంవారు శ్రీజగద్గురు విశ్వారాధ్య విశ్వభారతీ పురస్కార ప్రధానం చేసి గౌరవించారు. ఈ పురస్కారం మహాశివరాత్రి సందర్భంగా కాశీలోని పై మఠంలో తేది 16-2-2015న నిర్వహించిన సంస్కృత పండిత పరిషత్ సమావేశంలో విశ్వారాధ్య జ్ఞాన సింహాసన పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారి చేతుల మీదుగా రు. 25,000/-ల నగదు, సన్మానపత్రం, శాలువతో సహా అందజేయడమైనది.

ఈ సందర్భంలో 'సిద్ధాంత శిఖామణి' అను శైవసిద్ధాంత గ్రంథంపై సముద్రాల లక్ష్మణయ్య తాను సంస్కృతంలో రచించిన ఒక సమీక్షాగ్రంథాన్ని మఠాధిపతులకు సమర్పించారు.

డా॥ సముద్రాల లక్ష్మణయ్య గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం దేవస్థాన ప్రచురణలకు ప్రధాన సంపాదకులుగా, పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా వున్నారు. సంస్కృతాంధ్రభాషలలో నలుబదికి పైగా గ్రంథాలు రచించారు. రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠంవారు వీరికి 'వాచస్పతి', 'మహామహోపాధ్యాయ' అనే గౌరవ డాక్టరేట్లను ప్రధానంచేసి వున్నారు. తెలుగు విశ్వవిద్యాలయంవారు వీరిని 'ఉత్తమ సంస్కృత పండిత' బిరుదుతో సత్కరించి వున్నారు.

శ్రీ వ్యాసాశ్రమ పూర్వ విద్యార్థి - శ్రీమలయాళస్వాములవారి శిష్యులు అయిన వీరికి ఈ పురస్కారం అందడం ముదావహమని వ్యాసాశ్రమ పూర్వవిద్యార్థులు, భక్తులు హర్షం ప్రకటించారు.

# మహాభారతంలోని నీతి కథలు

.. డాక్టర్ కె. సత్యనారాయణ
సెల్: 9440732210

జీవితంలో అసూయాద్వేషాలు మనిషిని మరింత పతనావస్థకు అవమానాలకు కారణభూతమౌతాయని మమాభారతంలోని అరణ్యపర్వంలోని "ఘోషయాత్ర కథ" మనకు తెలియజేస్తుంది.

అనుద్యూతంలో ఓడిపోయిన ధర్మరాజాదులు 12 సంાల అరణ్యవాసం, 1 సం॥ అజ్ఞాతవాసాన్ని అనుభవించడానికి అరణ్యాలకు బయలుదేర్తారు. ముని ఆశ్రమాలను సందర్శిస్తూ మహర్షుల ఆశీస్సులను పొందుతూ ద్వైతవనం చేరతారు. వనవాస క్లేశంతోవారి శరీరాలు కృశిస్తున్నా మునిజనసేవతో పరమేశ్వర ఆరాధనలతో పాండవులు కాలం గడుపుతూ ఉంటారు. ఈ విషయాలు కొంతమంది విప్రుల ద్వారా విన్న శకుని, కర్ణులు దుర్యోధనుని సమీపించి "కురువంశ శిరోభూషణా! నీ వైభవాన్ని చూసి మీ విరోధులు తలవంచడమే మనకు ఎక్కువ ఆనందం. ఆపదలో చిక్కి, అనాధల వలె దిక్కులు పట్టిపోయిన శత్రువులను చూసినప్పుడే మనకు అవధులు లేని సంతోషం కలుగుతుంది" అని అడుగుతారు. ధృతరాష్ట్రుడు పుత్రవాత్సల్యంతో సరేనంటాడు. దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకునులూ, దుర్యోధనుని తమ్ములూ, అనుచరులూ, నట, విట, గాయక, పరిచారక గణములతో, అంగరంగ వైభవంగా ద్వైతవనానికి వెళతారు. ఆ ద్వైతవనంలో పాండవుల సమీపానే విందులు, వినోదాలూ, నట, విట, గాయక శ్రేణులతో కాలక్షేపాలు చేయడమే ఆ అరణ్యంలోని క్రూర మృగాలను వేటాడుతూ సరోవరానికి చేరతారు. ఆ సరోవరంలో విహరిస్తున్న చిత్రసేనుడనే గందర్వుని అనుచరులతో యుద్ధానికి దిగి చివరికి చిత్రసేనుని చేతిలో బంధింపబడతారు. ఈ వార్త తెలిసిన ధర్మరాజు భీమార్జునులతో బయలుదేరి వచ్చి దుర్యోధనాదులను విడిపిస్తారు. ధర్మరాజాదులను అవమానించాలని బయలుదేరిన దుర్యోధనాదులు తిరిగి విషాదవదనాలతో, అవమాన భారంతో రాజధాని చేరుకుంటారు. కావున ధర్మపరులను అవమానించాలని భావించడం మొదటికే మోసం తెస్తుందని ఈ కథమనకు తెలియజేస్తుంది.

▯

అహంకారమనేది మనిషి ఎంతటి ఉన్నత శిఖరాల్ని అధిరోహించిన అతణ్ణి అధఃపాతాళానికి తొక్కేస్తుంది. మహనీయులను సేవించే వ్యక్తుల్లోనైనా గర్వం తొంగిచూస్తే ఎలాంటి పరిణామాలకు లోనౌతారో చెప్పేదే 'గరుడ గర్వభంగ' కథ. ఇది ఉద్యోగ పర్వంలోనిది.

ఇంద్రుని రథసారథి మాతలి. సేవాధర్మంతో, శాంతస్వభావంతో, సద్గుణసంపదతో అందరిచేతా నిత్యం ప్రశంసలు పొందేవాడు. ఆయనకొక కుమార్తె. పేరు గుణకేశి. అందంతో పాటు సద్గుణాలరాశి. విద్యావతి, వినయశీలి. యుక్తవయస్కురాలైంది. మాతలి వరుని కోసం ఎక్కడెక్కడో వెతికి వేసారిపోగా, నారదుడు కన్పించి వరున, గరుడ లోకాలు తిప్పి నాగలోకం తీసుకెళ్తాడు. నాగలోకంలో మాతలి ఒక నవసుందరాంగుని చూస్తాడు. ఆ యువకుడు ఐరావత

వంశానికి చెందిన చికురుని ప్రియపుత్రుడు సుముఖుడు. కులపెద్ద అయిన ఆర్యకునితో నారదుడు "నాయనా! ఈయన ఇంద్రసారథి మాతలి. తన కుమార్తెను మీ ఇంటి కోడలిగా పంపాలని ఆయన సంకల్పం" అనంటాడు. అందులకు ఆర్యకుడు "దేవమునీ! గరుత్మంతుడు మొన్ననే మా 'చికురుని' ఆహారంగా భుజించాడు. తరువాతి వంతు ఈ సముఖునిది. తెలిసి తెలిసి వివాహం ఎలా జరిపేది? ఆడబిడ్డ జీవితాన్ని చీకటి ఎలా చేసేది ?" అని దీనంగా ప్రశ్నిస్తాడు.

నారదుడు మాతలిని వైకుంఠానికి తీసుకు వెళతాడు. మాతలి శ్రీమన్నారాయణుని సమీపించి, చేతులు జోడించి ప్రార్థించగా ఆయన సుముఖునికి పూర్ణాయుష్షును అనుగ్రహిస్తాడు.

"మాతలి సుముఖునికి తన బిడ్డనిచ్చి వివాహం జరిపిస్తాడు. వారిరువురూ దాంపత్య జీవితాన్ని ఆనందంగా గుడుపుతుండగా గరుత్మంతునికి ఈ విషయం తెలుస్తుంది. తీవ్రక్రోధంతో నాగలోకం చేరి "ఈ చతుర్దశ భువనాలకు అధిపతి అయిన శ్రీమహావిష్ణువు భారాన్ని ఈ ప్రపంచంలో నేనొక్కణ్ణే భరిచగలను. అంతటి శక్తి సామర్థ్యాలు కలిగిన నన్ను లెక్కచేయకుండా అవమానించారు." అని సుముఖుని తినబోతుండగా శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై "నాయనా! వినతానందనా! నా భారాన్ని మోయగల శక్తిమంతుడివి నువ్వే కదా! ఏదీ నా ఈ ఒక్క చెయ్యి నీ వీపు మీదుంచుతాను మొయ్యి" అని తన చెయ్యి గరుత్మంతుని వీపుపై ఉంచుతాడు.

గరుత్మంతునికి ఏడేడు లోకాలు మొత్తం పధ్నాలుగు కళ్లముందు కన్పించి కాళ్ళు పట్టు తప్పి, రెక్కలు గజగజలాడి, నోరెండి నాలుక పిడచకట్టుకు పోతుంది. "ఓ మహాప్రభూ! ఈ దీనుణ్ణి రక్షించండి" అని వేడుకుంటాడు. అప్పుడు విష్ణువు చిరునవ్వుతో "నాయనా! గరుత్మంతా! గర్వం, అహంకారం ఎప్పటికీ కీడు చేస్తాయని గ్రహించావా ?" అని పలికి అంతర్ధానమైపోతాడు.

* పాలు ఎన్ని వున్నా నాలుగు మజ్జిగ చుక్కలు వాటి స్వరూపాన్నే మార్చివేస్తున్నాయి. అలాగే పాలలాంటి సద్గుణాలు మనలో ఎన్ని వున్నా ఆ మజ్జిగ లాంటి దుర్గుణాలు నాలుగింటికి మనలో చోటుకల్పించామంటే చాలు! అంతా వ్యర్థమైపోతుంది.

* అనుభవంలోనికి రాని విద్య వీపుకు తగిలించుకున్న లాంతరు లాంటిది. అది తనకు వెలుగును చూపకపోగా ప్రమాదాన్ని తెచ్చిపెడ్తుంది.

* అణకువ, శాంతం, సత్యం - అనే వాటిని నీవు మిత్రులుగా చేసుకొని చెంత నుంచుకోగలిగితే నీ శత్రువులందరినీ అవే దూరంగా తరిమి వేస్తాయి.

* మనిషి ఉన్నతి అనే యింట్లో ప్రవేశించాలంటే కృషి అనేది సింహ ద్వారం. అదృష్టం అనేది పెరటి ద్వారం. అయితే ఏ యింటిలోనైనా సింహద్వారం నుండి వచ్చిన వాడికే నిజమైన గౌరవం ఉంటుంది.

జ్ఞాన సుధ

# జన్మ పరంపర

సహజ కవి వి. శ్రీరామరెడ్డి

ఎనభైనాలుగు లక్షల జీవరాశులు చస్తుపుడుతూ వుంటాయి. చావు అనగా మరణం, మరణం వినాశం కాదు మార్పు మాత్రమే. మనం పాత వస్త్రాన్ని వదలి కొత్తవస్త్రాన్ని ధరించినట్లు మరణ సమయంలో ఆత్మదేహమనే తొడుగును వదలి వేస్తుంది. ఆత్మ శరీరంతో ఉన్నపుడు తనకోరికలు తీర్చుకొని, కొన్ని కార్యాలను నిర్వహించి ఆపైన శరీరాన్ని వీడి మరో శరీరాన్ని ధరిస్తుంది. మన ఆలోచనలు కర్మలు ఎటులుండునో వాటిననుసరించి మన భవిష్యత్తు నిర్మాణం జరుగుతున్నది.

ఈ మహోత్కృష్ట సత్యమే మానవ నిర్మాణ దృక్పథానికి మూలం. మనిషిలో మరణానంతరం ఐహికమైన కోరికలు మిగిలి ఉన్నట్లయితే, మానవ క్షేత్రంలోనే అవి పరిపక్వత చెందాలి. వాటి నిర్మాణం కోసమే తిరిగి భూమ్మీద జన్మించడం జరుగుతుంది. మరణ సమయంలో ఏ విషయాన్ని గురించి ఆలోచనలుంటాయో ఆ దిశగానే సూక్ష్మశరీరం పయనించి నిర్ధేశించిన గమ్యాన్ని జేరుతుంది. సరికొత్త శక్తితో, బలంతో, కొత్త జీవితానికి అంకురార్పణ జరుగుతుంది.

ఈ జన్మబంధాలకు తోడు గత జన్మలోని అనుబంధాలు అంతరాత్మను కల్లోల పరిస్తే, ఆత్మానుగతమైన సంఘర్షణలు అంతరంగాన్ని అల్లకల్లోలం చేయడం కూడా జరుగుతుంది. ఈ రీతిగా జన్మజన్మల అనుబంధాలమధ్య నలిగిపోయే అంతరాత్మ ఆత్మపరంగా తీసుకోవలసిన నిర్ణయం ముక్తి మార్గాన్ననుసరించడం, ముక్తియనగా బంధం నుండి విముక్తిచెందడం, మనం కర్మఫలానికి ఎవరి మట్టుకు వారు జన్మలెత్తి ఆ కర్మఫలం అనుభవించడానికి బదులు ఇంకా ఇంకా పాప కర్మములను చేస్తే ఈ జన్మ పరంపర అట్లే కొనసాగుచుండును. అటువంటి జన్మ పరం పరనుండి విడివడి, మంచి మనస్సుతో యోచించి పరమాత్మునిలో కలసిపోయే మార్గం యోచించాలి, అదియే మోక్షం.

మోక్షం సాధించవలయునంటే కష్టసాధ్యమైన కార్యమని అది అంత సులభము కాదని అధైర్యపడక కొంచెం పట్టుదల ఓర్పుతో ఈ దేహం గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వున్నది. పంచభూతములతో నిర్మితమైన ఈ దేహాన్ని పంచేంద్రియాలు, అంతఃకరణచతుష్టయం నడిపిస్తున్నవి. ఈ ప్రపంచమొక మాయానిర్మితం, ఎపుడేమి జరుగునో ఎవ్వరికీ తెలియసాధ్యముకాదు. ఏమరుపాటున చరించినచో మాయా ప్రవాహమున కొట్టుకొనిపోయి మళ్ళీ మళ్ళీ జన్మించడం తప్పదు. ఈ మాయా ప్రభావం నుండి బయటపడవలెనంటే భగవంతుని అనుగ్రహం మెండుగా కావాలి. అందుకు శాస్త్రం ఇట్లు తెలుపుచున్నది.

**శ్లో॥ కృతయుగే తపశ్శైవ, త్రేతాయాం యజ్ఞకర్మణి**
**ద్వాపరేతు పరిచర్యాయాం, కలౌతత్ హరికీర్తనాత్॥**

ఈ కలియుగంలో హరినామ సంకీర్తనచే మోక్షం పొందవచ్చునని గట్టిగా చెప్పబడినది. హరినామ

సంకీర్తన నీకు అలవడవలెనంటే అందుకు భక్తి అవసరం. భక్తియనగా భగవంతునిపై అహర్నిశలు మనస్సు నిలువడం. మనస్సు చంచలం, నిలకడైనదికాదు అని అనుకొన్నచో ముందుకుపోవుటకు వీలుండదు. కావున పట్టుదలతో భగవంతునికి దగ్గర కావాలి. అభ్యాస వైరాగ్యములచేత మనస్సు పరిపరివిధములపోనీక నియంత్రించి హృదయంలో పరమాత్ముని స్వరూపం నిల్పుకొని సాధనాపూర్వకంగా నామసంకీర్తన చేస్తూ సర్వప్రపంచము పరమాత్ముని స్వరూపమేనని, దయాభి మానములు గల్గి దానధర్మములుచేస్తూ, శాంతి సహనములు అలవర్చుకొని, ఆశా మోహములను త్యజించి, కామక్రోధములను జయించి శ్రద్ధాభక్తులు మెండుగా నున్నపుడే నీవు మోక్షార్హుడవని తెలుసుకోవాలి.

**ఈజన్మమందెకాని ముక్తి మరి ఏ జన్మమందు లేదు**
**చేజేతదను దెలియక మానవుడు చెడిపోవు నారాయణా॥**

మానవజన్మయందే మోక్షాన్ని పొందే అవకాశం మెండని అదియే మానవ జన్మధ్యేయమని శాస్త్రం చెబుతున్నది. కానీ ఇతర ఏ ప్రాణికోటి నుద్దేశించి చూచినను మోక్షాన్ని సాధించే అవకాశం అంతగా కనిపించదు. ఎందుకంటే మానవునికున్న జ్ఞానం ఏ ఇతర జంతువులకు లేదు గనుక ''జ్ఞానాదేవహి కైవల్యమ్॥ సూక్తి.

**శో॥ శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥**

ఈ సమస్త ద్రవ్య యజ్ఞములకంటే జ్ఞానయజ్ఞమే శ్రేష్టమంటుంది భగవద్గీత.

**.. జ్ఞానసుధయను కావ్యము పరిసమాప్తం....**


# శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి 'ఆరాధన' కల్యాణ మహోత్సవముల శుభ ఆహ్వానము

## తేది : 25-04-2015 నుండి 29-04-2015 వరకు

పూజ్యపాద **శ్రీశ్రీశ్రీ 'యోగి' అచలానందస్వాములవారి దివ్య ఆశీస్సులతో** స్వస్తిశ్రీ మన్మథ నామ సంవత్సర వైశాఖ శుద్ధ **'దశమీ' శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి "ఆరాధన" సందర్భముగా తేది 25-04-2015నుండి 29-04-2015 వరకు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారి "ఆరాధన, కల్యాణ మహోత్సవములు** జరుగును. కావున భక్తులందరు ఈ కార్యక్రమములలో పాల్గొని శ్రీస్వామివారి అనుగ్రహమునకు పాత్రులు కాగోరుచున్నాము.

**ఆరాధన సందర్భముగా 28, 29 తేదీలలో అన్నదానము** జరుగును

# శ్రీ అచలానంద ఆశ్రమము

**H.O.** మంగమూరు రోడ్, బైపాస్ జంక్షన్, ఒంగోలు. ఫోన్స్: 9949132469,
**B.O.:** తోట్లపల్లి, బ్రహ్మంగారి మఠం, కడప జిల్లా. సెల్ : 97055 55229

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్; 09410990829

## ద్వేషము

ఒక వ్యక్తిని జుగుప్సాభావముతో జూచుచు, అతనియందు వైరబుద్ధిని పెంచుకొని, అతనిపై పగసాదించవలెననెడి చిత్తప్రవృత్తినే 'ద్వేష' మందురు.

**"దుర్గుణానాం హి సర్వేషాం ద్వేషో ముఖ్యః ప్రకీర్తితః"** అనగా 'దుర్గుణములన్నింటిలో ద్వేషము ప్రముఖమైనదని చెప్పబడినది'. కావున, మానవుని యొక్క పతనమునకు ఈ ఒక్క దుర్గుణమున్న చాలును. మిగిలిన దుర్గుణములు తమంతట తామే ప్రవేశించును.

ద్వేషము యొక్క దుష్ఫలితములను మహాభారతము మనకు చక్కగా బోధించుచున్నది. శ్రీ వ్యాసమహర్షి విరచిత 'మహాభారతము' సర్వవేదముల సారము, 'పంచమవేద' మని ప్రసిద్ధికెక్కినది. వేదములలోని సకల ధర్మములను శ్రీ వ్యాసమహర్షి 'మహాభారతము'లో గుప్పించినారు. వేద ధర్మములను సాధారణ మానవునకు అర్థమవునట్లు కథారూపములో సృష్టించి, బోధించినారు శ్రీవ్యాసభగవానులు. సర్వవేద ధర్మముల సంగ్రహమే మహాభారత ఇతిహాసమని పెద్దలు నుడివిరి. 'మహాభారతములో లభింపని ధర్మము మరి యింకెక్కడను లభించదు' అని మున్నుడి.

అటువంటి మహాభారత మహావృక్షమునకు విత్తనము 'ద్వేషమే'. సదాచారులు, ధర్మాత్ములు అయిన పాండవుల యెడ దుర్యోధనుడు పెంచుకొనిన ద్వేషమే విత్తనమై, అది మొలకెత్తి, పెరిగి పెరిగి మహావృక్షమయి మహాభారత సంగ్రామమునకు కారణభూతమైనది. మహాభారతమునంతను కూలంకషముగా వెదకినను పాండవులు దుర్యోధనునకు మనఃపూర్వకముగా నొనరించిన అపకారమెచ్చటను కనిపించదు. అంతియే గాక అనేకసార్లు కష్టకాలములో దుర్యోధనుని ఆదుకొని సహాయముచేసినారు. అయినప్పటికి దుర్యోధనుని మనస్సులోని ద్వేషము మాత్రము ఇసుమంత అయినను తగ్గక, ఇంకను వృద్ధిబొందుచునే యుండెను. విమర్శించి చూచినయెడల దుర్యోధనుని యొక్క ద్వేషమునకు సరియైన కారణమొక్కటియు కనిపించదు. నిష్కారణముగా దుర్యోధనుడు ద్వేషమును పెంచుకొని, పాండవులననేక ఇక్కట్ల పాలుజేసినాడు. సన్మార్గులు, సదాచారులు, ధర్మాత్ములయిన పాండవుల యొక్క రూప సౌందర్యములు, బలపరాక్రమములు, కీర్తిప్రతిష్ఠలు తప్ప మరియొక కారణమేమియు కనిపించదు దుర్యోధనుని యొక్క ద్వేషమునకు.

ఈ ద్వేషము మూలముననే దుర్యోధనుడు తాను నశించినదియేగాక తన వంశమును, తన కులమును పూర్తిగా నశింపచేసినాడు. అకటా! ద్వేషము యొక్క ప్రభావమెంత చెడ్డది !

కావున, ప్రతి మానవుడు ఏ ప్రాణిని ద్వేషింపక, అన్ని ప్రాణులకు ప్రేమను పంచిపెట్టి సన్మార్గములో జీవించుమని సనాతనధర్మము బోధించుచున్నది.

ద్వేషమువలన కలుగు దుష్పరిణామములను ఈ క్రింది సూక్తి మనోహరముగా వివరించుచున్నది - గమనింపుడు:

**శ్లో॥ ద్వేషా ద్వైరాణి వర్థన్తే కలహాశ్చ తదుద్భవాః ॥**
**వైరా ద్దుఃఖం చ నిందాశ్చ వైరా న్మృత్యుశ్చ సంభవేత్ ।**
**వైరే బుద్ధించ కుర్యాచ్చ మనసా వైర ముత్సృజేత్ ॥**

'ద్వేషము వలన వైరములు వృద్ధిజెందును. తత్కారణముగా కలహములు ఉద్భవించును. వైరము దుఃఖమునకు కారణమగును. వైరము వలన నిందలు ప్రాప్తించును. వైరము వలన మృత్యువు గూడ సంభవించును. కావున వైరబుద్ధి యెన్నటికిని పనికిరాదు. ద్వేషబుద్ధిని మనస్సు నుండి త్యజించవలయును'.

ఏ ప్రాణియెడల ద్వేషమును పొరపాటున గూడ మన మనస్సులోనికి రానీయగూడదు. తెలిసియైనను లేక తెలియకయైనను అటువంటి ద్వేషభావమును మన మనస్సులోనికి రానిచ్చినయెడల, దానియొక్క ప్రతిక్రియ (రియాక్షన్)గా ఎదుటి వ్యక్తిలో గూడ మన యెడల ద్వేషము ఉద్భవించును. దీనికి తార్కాణముగా ఒక చిన్న కథను పెద్దలు చెప్పుచుందురు.

ఒక ఊరిలో ఒక రాజు వుండెను. ఆ గ్రామములో ఒక బీదవాడు నివసించుచుండెను. అతడు అడవికి వెళ్ళి కట్టెలు కొట్టి తెచ్చి, వాటిని విక్రయించి, ఆ వచ్చిన ధనముతో జీవితమును వెళ్ళబుచ్చుచుండెను. అతడు అడవికి వెళ్ళునప్పుడు, తిరిగి వచ్చునపుడు రాజుగారి కోట మార్గమును అనుసరించుచుండెను. అతనిని చూచినపుడు రాజు యొక్క మనస్సులో అతని యెడల ఒక విధమైన జుగుప్స, ద్వేషము ఉద్భవించుచుండెను. అతడు రాజుగారికి ఎటువంటి అపకారమును చేసియుండలేదు. అయినప్పటికి అకారణముగా రాజు యొక్క మనస్సులో ద్వేషభావము ఉత్పన్నమగుచుండెను. రాజు ఎంత దీర్ఘముగా ఆలోచించినను అద్దానికి కారణము కన్పడ కుండెను.రాజు సచివోత్తముల సంప్రదించినను కారణము అనూహ్యమాయెను.

ఇట్లుండ, ఒకరోజు రాజు బీదవానిని దర్బారునకు పిలిపించి, అతని యొక్క యోగక్షేమములను గురించి, అతని యొక్క నిత్యకార్యక్రమమును గురించి, అతని యొక్క జీవన విధానమును గురించి ప్రశ్నించెను.

అపుడు, ఆ బీదవాడు తాను అడవికి వెళ్ళి వివిధరకములైన కట్టెలు కొట్టి తెచ్చి వాటిని విక్రయించి, ఆ ధనముతో జీవించుచున్నాననియు, ఆ కట్టెలలో విలువ గల గంధపు చెక్కలను మాత్రము నిలువయుంచుచున్నట్లు చెప్పెను. రాజు కారణము నడుగగా, గంధపుచెక్కలు రాజుగారి అవసానదశలో అవసరపడునుగాన, అపుడు తనకు మంచిమూల్యము లభించుననెడి తలంపుతో తాను ఆ గంధపుచెక్కలను నిలువయుంచుచున్నానని ఆ బీదవాడు సమాధానమొసంగెను. ఆ సమాధానము విని, రాజు ఆశ్చర్యచకితుడాయెను; మరియు తనకు ఆ బీదవానిపై ద్వేషభావము ఎందుకు కలుగుచున్నదో అర్థమాయెను.

ఇచట గమనించదగిన విషయమేమిటంటే - ఆ బీదవాడు అమాయకత్వముతో తనకు తెలియకుండానే రాజు యొక్క మృత్యువును కోరుచున్నాడు. ఇతనిలో నున్న యీ చెడు కోరికయే రాజు యొక్క మనస్సులో ఆ బీదవానిపై ద్వేషభావమును ఉత్పన్నము చేయుటకు కారణమయినది. ఆ బీదవాడు రాజునకు చెడును కోరుచున్నాడు గనుక రాజు యొక్క మనస్సు గూడ ఆ

బీదవాని యెడల చెడుభావమును అనగా ద్వేషమును జనింపజేయుచున్నది. అది సహజము మరియు ప్రకృతి నియమము అయివున్నది. ఈ ప్రకృతి నియమమును ఈనాటి భౌతిక శాస్త్రము గూడ action and reaction సిద్ధాంతము ద్వారా బోధించుచున్నది. ఈ సిద్ధాంతము ప్రకారము every action will have its reaction, action and reaction are equal in force and opposite in direction.

ఇచ్చట action - బీదవాడు రాజు యొక్క మృత్యువును కోరుట. Reaction బీదవాని యెడల రాజుయొక్క మనస్సులో ద్వేషము ఉత్పన్నమగుట.

ఈ కథ చెప్పుచున్న నీతి ఏమనగా - పొరపాటుచేసైననూ, ఆఖరుకు స్వప్న మందైననూ ఏ ప్రాణిని ద్వేషింపరాదు.

ద్వేషము యొక్క నీచత్వమును చక్కని ఉపమానముతో ఈ క్రింది సూక్తి బోధించుచున్నది.

**శ్లో॥ ద్వేష స్తూన్నతిరూపస్య పారిజాతద్రుమస్య తు।**
**మూలఘ్నః కీటక నిభః ఇతి జానీహి పుత్రక ॥**

'పురోభివృద్ధియను పారిజాత వృక్షమునకు ద్వేషమను దుర్గుణము వేరుపురుగు వంటిదని తెలిసికొనుము'.

ఇచట ద్వేషము నీచమైన కీటకముతో పోల్చబడినది. కావున ఈ పురుగును ఆదిలోనే అంతము చేయవలయును. ఇది పెరిగి పెద్దదైన యెడల అభివృద్ధిజెందుచున్న మానవుడను పారిజాత వృక్షమును సమూలముగ నశింపచేయును. కనుక అభివృద్ధి జెందదలచుకొన్న ఏ మానవుడైనను ఈ ద్వేషమను చీడపురుగును దరిజేరనీయరాదు.

ద్వేషమును అంతమొనర్చుటకు మార్గమును ఈ క్రింది సూక్తి సూచించుచున్నది.

**శ్లో॥ వైరవృద్ధై భవే ద్వేషః ప్రేమ్ణా ద్వేషస్తు నశ్యతి।**
**ప్రేమరూపమతం యత్స్యాత్ దద్దివ్యమత ముచ్యతే ॥**

'ద్వేషముచేత ద్వేషము వృద్ధియగును. ద్వేషము ప్రేమ చేత నశించును. ప్రేమ తత్త్వమే దివ్యమతమని చెప్పబడుచున్నది'.

'ద్వేషించినవానిని ప్రేమించు' మని సనాతన ధర్మము బోధించుచున్నది. అలాంటి వ్యక్తులు ప్రపంచ చరిత్రలో లేకపోలేదు. యేసుక్రీస్తు తనను ద్వేషించుచున్న వ్యక్తులను ప్రేమించినాడు. తనను శిలువపై నెక్కించి, శీలలు కొట్టుచున్న దుర్మార్గులను సహితము క్షమించి, ప్రేమించిన ప్రేమస్వరూపుడు యేసుక్రీస్తు. "తండ్రి! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమింపుము"అని తండ్రిని ప్రార్థించిన ప్రేమహృదయుడు యేసుక్రీస్తు.

అలాగుననే దుర్యోధనుడు పాండవులను ద్వేషించుచున్నప్పటికి, యుధిష్ఠిరుడు మాత్రము అతనిని ప్రేమించుచుండెను. అనేక క్లిష్టపరిస్థితులలో దుర్యోధనుని రక్షించెను.

శ్రీకృష్ణ పరమాత్మ, ఏప్రాణియందును ద్వేషబుద్ధిలేని భక్తుడు తనకు చాలా ఇష్టుడని భగవద్గీతలో చెప్పినాడు.

**"అద్వేష్టా సర్వభూతానాం-యో మద్భక్తస్సమే ప్రియ "** (భ.గీ. 12-13)

'సర్వప్రాణులయందు ద్వేషము లేని భక్తుడు నాకు మిగుల ప్రియమైనవాడు' అని శ్రీకృష్ణ భగవానుడు నుడివినాడు.

కావున, ప్రతి మానవుడు ఏ ప్రాణిణి గూడ ద్వేషింపక, సర్వప్రాణులను ప్రేమించుచు, తాను ప్రేమింపబడుచు, తన జీవితమును ఆనందమయ మొనర్చుకొనుగాక!

గీతా సుధ



# భగవద్గీతకు భాసుర భాష్యం

డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

మరి ఇలా అర్జునుడు అడిగితే "అలాగే! ఓ పార్థా నీవు వందల కొలదీ, వేల కొలదీ ఉన్న నానా విధాలైన నా (పని) రూపాలను జూడు

**పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః ।**
**నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ॥ (11-05)**

"ఓ భరత వంశజా! ఇంతకు ముందర నీవెప్పుడు చూడని అద్భుతాలను ఇప్పుడు చూడు. ఆదిత్యుల, రుద్రుల, వసువుల, అశ్వినుల, మరుత్తుల, ఇతర దేవతల యొక్క గోచరించే రూపాలను దర్శించు"

**పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రానశ్వినౌ మరుతస్తథా ।**
**బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత (11-06)**

"నీవు ఏమేమి చూడాలనుకుంటున్నావో, ఏమేమి చూడగోరుతున్నావో, చరాచరాలను ఒకేచోట చూడు" అంటూ కృష్ణుడు గుడా కేశానికి (అర్జునునికి) వివరించాడు.

**ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్ ।**
**మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి॥ (11-07)**

కానీ నీవు ఈ కళ్లతో, ఈమనసుతో చూడలేవు. మానసికంగా ఎదగాలి. ఆశక్తిని నీకు నేను (పనిని) ప్రసాదిస్తున్నాను. అప్పుడు మాత్రమే నీవు నా యోగ వైభవాన్ని దర్శించగలుగుతావు.

**న తు మాం శక్యసే ద్రష్టుమ్ అనేనైవ స్వచక్షుషా।**
**దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ ॥ (11-08)**

మనం నేల మీద నిలబడే కొద్ది దూరం (మహా అయితే ఒక కిలో మీటరు వ్యాసార్థం) మేరకు చూడగలం. ఆకాశం మన మీద బోర్లించినట్లు ఉంటుంది. ఎక్కడ భూమి ఆకాశం కలిసినట్లుగా కనిపిస్తాయో (నిజంగా కలవవు) ఆ పరిధిని క్షితిజరేఖా అంటారు అంటే మనం అంత వరకు చూడగలం అన్నమాట. ఒకవేళ అంతకంటే ఎక్కువ చూడాలంటే మనం పెద్ద భవనాన్ని ఎక్కిచూడాలి. మరి అంతకంటే ఎక్కువ పరిధిచూడాలంటే ఏ చార్మినారో ఎక్కిచూడాలి. లేదా హెలిక్యాప్టరులో నుండో, విమానం లోనుండో చూడాలి. అప్పుడు (అంతపై నుండి చూస్తున్నప్పుడు) ఈ బస్సులు చీమల్లాగా, ఈ రైళ్ళు చిన్న క్రిములులాగా కనిపిస్తాయి. భూమి మీద నుండి చూస్తే చాలా పెద్దగా ఉండే బస్సులు, రైళ్లు వగైరా అంత ఎత్తుకు మనం ఎదిగితే చిన్నవైపోతాయన్న మాట (చిన్నవిగా కనిపిస్తాయన్నమాట). జీవితంకూడా అంతే మనం సమస్యకన్నా పెద్ద వాల్లమయితే సమస్య చిన్నదిగా కనిపిస్తుంది.

ఇప్పుడు కృష్ణుడు అర్జునుడికి మానసికంగా ఎదగడం నేర్పాడన్నమాట! ఇప్పుడు అర్జునుడు మానసికంగా ఎంతో ఎత్తుకు ఎదిగాడన్నమాట! ఎగిరాడన్నమాట! అంత ఎత్తునుండి కృష్ణుణ్ణి (పనిని) చూస్తున్నాడన్నమాట. ఇప్పుడు అర్జునుడు మునుపటి అర్జునుడు గాడన్నమాట. (ఎం.పి.గా ఉన్నప్పటి

లాల్‌బహూదూరు శాస్త్రి వేరు, మంత్రిగా లాల్‌బహూదూరుశాస్త్రివేరు, ప్రధాన మంత్రిగా లాల్‌బహూదూరుశాస్త్రివేరు.అదే లాల్‌బహూదూరుశాస్త్రి అయినప్పటికీ ఎదిగే కొద్దీ దృక్పథం విశాలమైనదన్న మాట) క్లర్కుగానో, టైపిస్టుగానో వున్న వ్యక్తి సాదారణంగా తన పని వరకే చూసుకుంటాడు చక్కగా చేసుకుంటాడు.

అంతకన్నా పైస్థాయికి వెళ్లిన తర్వాత, ఆ యూనిటుకు అధిపతి అవుతాడు. అన్ని విభాగాలూ తానే చూచుకుంటాడు.

అంతకన్న ఎదిగినపుడు మొత్తం శాఖలన్నిటికీ అధిపతి అయి మానసికంగా ఎంతో ఎత్తుకు ఎదుగుతాడు.

ఇక్కడ కూర్చోని దేశంలోవున్న అన్నిశాఖల మీద దృష్టిపెడతాడు. ఢిల్లీలోకూర్చున్నా, కన్యాకుమారిలోని యూనిట్లో ఏమిజరుగుతున్నదో, అస్సాములో ఉన్నశాఖలో ఏమి జరుగుతుందో, గుజరాతులోని శాఖ ఎలా ఉందో అంతా అతనికి (మానసికంగా) కనిపిస్తుంది.

ఇప్పుడు అర్జునుని మానసికస్థితి కూడా అలాగేఉన్నది. ఇప్పుడు అర్జునుడు నిజంగా అర్జునుడే (అర్జునుడు అంటే "తెల్లనివాడు" అని అర్థం) అంటే మానసికంగాఎదిగి విజ్ఞానాన్ని పెంచుకున్న విజ్ఞానమయిడని అర్థం. ఇప్పుడు అర్జునుడు కృష్ణుడి (పనియొక్క) విశ్వరూపాన్ని చూచేటంత మానసికమైన శక్తి సంపాదించాడన్నమాట! ఇప్పుడు అర్జునుడు ఏ హెలీక్యాప్టర్‌లోనుండో, ఏ విమానంలో నుండో క్రిందికి చూస్తున్నాడన్నమాట (మానసికంగా). ఇప్పుడు తనికి క్రిందవున్న సమస్తం గోచర మవుతున్నదన్న మాట!

... సినిమాల్లో లాగా సీను 'కట్' చేస్తే...

ఈ కృష్ణార్జునుల మధ్య జరుగుతున్న సంభాషణను, సంవాదాన్ని, సంజయుడు ధృతరాష్ట్రనికి వివరిస్తున్నాడు. సంజయుడు కురుక్షేత్రంలో జరిగిన ప్రతి విషయాన్ని పూసగుచ్చినట్లు 'గుడ్డీరాజు'కు వివరిస్తున్నాడు. కృష్ణుడి మాటలతో అర్జునుడు ఎలా మానసికంగా ఎదిగిపోయాడో ఆ మాటలు సంజయుడుకూడా వింటున్నందున సంజయుడు కూడా మానసికంగా ఎదిగిపోయాడన్నమాట! ఇప్పుడు అర్జునుడు ఎలా ఎలా ఏమేమి విషయాలు స్పష్టంగా చూడగలుగుతున్నాడో అంతే స్పష్టంగా సంజయుడూ చూడగలుగుతున్నాడన్నమాట!

"ఓధృతరాష్ట్ర మహారాజా! ఇలా పలికి దేవాది దేవుడైన కృష్ణుడు అర్జునునికి విశ్వరూపాన్ని చూపించాడు" అంటూ సంజయుడు ధృతరాష్ట్రునికి వివరించాడు.

**ఏవముక్త్వా తతో రాజన్ మహాయోగేశ్వరో హరిః**
**దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్ (11-09)**

... మళ్లా.... సీను..... కృష్ణార్జునుల మధ్యకు ... వెళుతున్నది...

*** చెడు సంకల్పాలు కలుపు మొక్కల వంటివి. వాటిని ప్రత్యేకించి మనం పెంచవలసిన పనిలేదు. కాని మంచి సంకల్పాలు పూల మొక్కల లాంటివి. వాటిని నిత్యం ఎంతో శ్రద్ధతో పెంచుకుంటూ రావాలి.**

*** ప్రతి ఉదయం మనిషికి ఓ క్రొత్త అవకాశం. గతాన్ని దిద్దుకోవడానికి, వర్తమానాన్ని మెరుగుపరచుకోవడానికిన్నీ.**

# రఘువంశం



మహాకవికాళిదాసు
కృతికిభావానువాదం:
డా॥ సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి

(గత సంచిక తరువాయి)

రెక్కలతోడి సర్పాల లాగా ఇంద్రుని బాణాలు క్రిందికీ, రఘువు బాణాలు మీదికీ మహాభయకరంగా ప్రసరించాయి. ఆకసాన సిద్ధులూ, నేలపై సైనికులూ విస్మయావహమైన ఆ దృశ్యం చూస్తూ తటస్థంగా వుండిపోయారు.

ఇంద్రుడు రఘువుపై ఎడతెరపి లేకుండా అస్త్రవృష్టి కురిపించాడు. ఐనా తనలోనుండే పుట్టిన పిడుగును మబ్బు ఆర్పజాలనట్లు తన అంశమునుండే జనించి దుస్సహమైన తేజంతో వెలిగిపోతున్న రాజపుత్రుణ్ణి తెగటార్చలేకపోయాడు.

పిమ్మట మథించేటప్పుడు సముద్రం మ్రోగినట్లు హరిచందనాంకితమైన ఇంద్రుని ముంజేతిపై మ్రోగుతున్న అల్లెత్రాటిని రఘువు అర్ధచంద్రబాణంతో తెగనరికాడు. దానితో దేవేంద్రుని కోపం మేరమీరింది. అతడు ప్రబల శత్రువును హతమార్చడానికి నిశ్చయించుకొని చేతనున్న విల్లు వదలి కండల రెక్కలను తెగనరకడాని కుపయోగించే కాంతిమంతమైన వజ్రాయుధం చేబూని అతని వక్షంపై గుణిచూచి కొట్టాడు. ఆ దెబ్బతో యువరాజు నేలగూలాడు. అతని సైనికులు భోరున ఏడువసాగారు. క్షణంలో రఘువు నొప్పి దులుపుకొని పైకి లేచాడు. సైనికులు ఆహ్లాదంతో సింహనాదాలు చేశారు. వజ్రాయుధపు దెబ్బకు సైతం తట్టుకొని తీవ్ర వైరంతో మళ్ళీ పోరాటానికి తలపడ్డ రాజపుత్రుని పరాక్రమానికి ఇంద్రుడు మెచ్చుకొన్నాడు. పగవారైతే మాత్రం గుణవంతులను మెచ్చుకోకుండా వుంటారా?

ఆపై దేవేంద్రుడు రఘువును చూచి "కొండలను నరకడంలో గూడా అడ్డులేనిది ఈనా వజ్రాయుధం. నీవు దప్ప మరెవ్వడూ దీన్ని ఓర్చుకొన్నవాడు లేడు. నీ విక్రమాతిశయానికి నేనెంతో మెచ్చుకొన్నాను. ఈ గుఱ్ఱం తప్ప మరేమి అడుగుతావో, అడుగు. ఇస్తాను" అని స్పష్టంగా చెప్పాడు.


ఇంద్రు డలా ప్రియంగా పలికిన మాట విని అప్పుడే పొది నుండి పైకెత్తుతూ వుండిన బంగరు పిడికాంతులొలికించే శరాన్ని మళ్ళీ పొదిలోనే పెట్టి రఘువు ఆయనతో ప్రీతిగా ఇలా అన్నాడు.

"ప్రభూ! గుఱ్ఱాన్ని వదలడం వీలుగాని పక్షంలో లనవరత యాగ దీక్షితుడైన మాతండ్రికి ఈ యాగంగూడా యథావిధిగా పూర్తి అయితే ఏ ఫలం కలుగుతుందో ఆ ఫలం ప్రసాదించండి! ఈ సంగతి ఇంటనున్న మానాన్నగారికి మీదూతద్వారానే తెలియజేయండి! యజ్ఞదీక్షితుడై ముక్కంటి మూర్తి విశేషమై వున్న ఆయన చెంతకు ఈ స్థితిలో నేను పోవడం వీలుగాదు".

అతని అభ్యర్థన అంగీకరిస్తూ "అలాగే చేస్తాను" అని చెప్పి ఇంద్రుడు వచ్చినదారినే తిరిగి వెళ్ళాడు. తనకోరిక నెరవేరినా గుఱ్ఱాన్ని పోగొట్టుకొన్నానన్న చింతతో ఎక్కువ సంతోషం లేకుండానే రఘువు తండ్రివద్దకు తిరిగివచ్చాడు. అతడు సభామండపం చేరక ముందే ఇంద్రుని దూతద్వారా దిలీపమహారాజు జరిగిన సంగతి తెలుసుకొన్నాడు. కుమారుడు సమీపించగానే వజ్రాయుధపు దెబ్బతిని వున్న అతని దేహాన్ని చల్లని చేతితో మెల్లగా నిమురుతూ బుజ్జగించాడు.

ఇలా దిలీపుడు దేహపాతానంతరం స్వర్గానికి వెళ్ళటానికి మెట్లు కట్టుకొన్నాడా అన్నట్లు తొంబై తొమ్మిది అశ్వమేధయాగాలు పూర్తిచేశాడు. పిమ్మట అతడు విషయభోగాలపై విరక్తిచెంది రాజ్యభారం పూర్తిగా కుమారుడి కప్పగించి వానప్రస్థ వృత్తి నవలంబించి సుదక్షిణాదేవితో సహా తపోవనంలో నివసించాడు. వయసు చెల్లిన ఇక్ష్వాకు వంశస్థులకు అలా చేయడం కులవ్రతమేకదా! □

# శ్రీరామ భక్తి



## 1. సదాశివుని శ్రీరామభక్తి

- కీ.శే. డాక్టర్ రోహిణి వెంకట సుందరవరద రాజేశ్వరి

**హస్తేఽక్షమాలా హృది కృష్ణ తత్త్వం**
**జిహ్వాగ్ర భాగే వరరామ మంత్రమ్।**
**యన్మస్తకే కేశవపాద తీర్థం**
**శివం మహాభాగవతం నమామి॥**

హస్తమందు రుద్రాక్షమాల, హృదయమందు శ్రీకృష్ణతత్త్వము, జిహ్వాగ్ర భాగమందు నిరంతర సుందర రామమంత్రము. శిరస్సుపై శ్రీనారాయణ పాదకమలోద్భవ గంగను ధరించిన మహాభాగవతుడు, పరమభక్తుడు, ఉపాసకుడైన శ్రీ శివునకు నమస్కారము.

త్రిలోకములలో శ్రీరాముని పరమభక్తుడు, పరమోపాసకుడు, వైష్ణవులలో అగ్రగణ్యుడు, వైష్ణవాచార్యుడు, అమరకథాదివక్త, శశాంక శేఖరుడైన మహాదేవుడే "శ్రీరామ" అను మహామంత్రమును అహర్నిశలు జపించుచుండును.

శంకరభగవానుడు రామాయణమునకు ఆద్యాచార్యుడు. శ్రీరాముని చరిత్రను నూరుకోట్ల శ్లోకములలో వర్ణించెను.

శివుడు ఈ శ్లోకములను దేవతలకు, దైత్యులకు, ఋషులకు సమానముగా పంచి పెట్టగా ఒక్కొక్కరి భాగమునకు ముప్పదిమూడుకోట్ల, ముప్పది మూడు లక్షల, ముప్పది మూడు వేల, మూడు వందల, ముప్పది మూడు శ్లోకములు వచ్చెను. తొంబది తొమ్మది కోట్ల, తొంబది తొమ్మిది లక్షల, తొంబది తొమ్మిదివేల, తొమ్మిది వందల, తొంబదితొమ్మిది పంచబడినవి. ఒక్క శ్లోకము మిగిలినది. దేవతలు, దైత్యులు, ఋషులు ఈ ఒక్క శ్లోకమునకు పోట్లాడు కొనసాగిరి. ఈ శ్లోకము అనుష్టుప్ ఛన్దములోనున్నది. అనుష్టుప్ ఛన్దమందు ముప్పది రెండు అక్షరములుండును. శ్రీశివుడు ముగ్గురకు పది పది అక్షరములను పంచగా చివరకు రెండు అక్షరములు మిగిలెను. అప్పుడు శివుడు "ఈ రెండు అక్షరములను నేను ఎవ్వరికిని ఇవ్వను. ఈ అక్షరములను నా కంఠమందే ఉంచెదను" అని అనెను. ఇవియే "రా" "మ" అను రెండక్షరములు. ఇవియే వేదముల సారము.

రామ నామము అతి సరళమైనది, అతి మధురమైనది. అమృతము కంటె తియ్యనయినది. ఇది అమర మంత్రము. శివుని కంఠమందు జిహ్వాగ్ర భాగమందు విరాజమానమైయున్నది. సాగర మథన సమయమందు ఉదయించిన హాలాహల మును శివుడు పానము చేయుచుండ భక్తులు హాహాకారములు చేయసాగిరి. అప్పుడు శంకరుడు వారిని ఓదార్చుచు ఇట్లనెను.

**శ్రీరామ నామామృత మంత్ర బీజ**
**సంజీవనీ చే న్మసి ప్రవిష్టా।**
**హాలా హలం వాప్రల యానలం వా**
**మృత్యోర్ముఖం వా విశతాం కుతోభీః॥**

- ఆనంద రామాయణము)

"శ్రీరామ నామము సర్వమంత్ర బీజము. ఆ సంజీవని నా సర్వాంగముల యందు సంపూర్ణముగ

నిండియున్నది. అందుచేత హాలాహల విషమువలన గాని, ప్రళయానల జ్వాల వలన గాని, మృత్యువు వలన గాని నాకెట్టి భయము లేదు" అని వారితో చెప్పచు శివుడు విషము త్రాగెను. ఆ విషము అమృతముగ మారెను. ఆనాటి నుండి శివుడు "నీలకంఠ" నామము ధరించెను. సమస్త దేవతలలో శివుడు మహాదేవుడయ్యెను.

శివభగవానుడు పార్వతితో రామనామ మహిమను గురించి ఈ విధముగచెప్పెను.

**ఆపదా మప హర్తారం దాతారం సర్వ సంపదామ్।**
**లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్య హమ్॥**
**భర్జనం భవ బీజా నామర్జనం సుఖ సంపదామ్।**
**తర్జనం యమ దూతానాం రామరామేతి గర్జనమ్॥**
**రామోరాజమణిః సదా విజయతే రామం రమేశం భజే**
**రామే ణాభిహతా నిశాచరచమూ రామాయ తస్మై నమః।**
**రామాన్నాస్తి పరాయణం పరతరం రామస్య దాసో-స్మ్యహం**
**రామే చిత్తలయః సదా భవతుమేః భోరామ! మాముద్ధర॥**
**రామరామేతి రామేతి రమే రామే మనోరమే।**
**సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే॥**

(రామ రక్షా స్తోత్రము)

"ఆపదలను హరించువాడు, సమస్త సంపదల నొసగువాడు, లోకాభి రాముడునగు శ్రీరామునకు పదే పదే నమస్కారములు చేయుచున్నాను. రామ-రామ అను గర్జనము సమస్త సంసార బీజములను వేగించునది. సమస్త సుఖ సంపత్తులను గలుగజేయునది. యమ దూతలను భయపెట్టునది. రాజులలో శ్రేష్ఠుడైన శ్రీరాముడు సదా విజయమును చేకూర్చును. నేను లక్ష్మీపతి అయిన శ్రీరామ భగవానుని భజించుచున్నాను. సమస్త రాక్షసులను సంహరించిన రామచంద్రునకు ప్రణామము చేయుచున్నాను. రాముని కంటె గొప్ప ఆశ్రయములేదు. నేను రామచంద్రుని దాసుడను. నా మనస్సు సదా రాముని యందే లగ్నమై యుండును. ఓ రామా! నన్నుద్ధరింపుడు.

(శ్రీ మహేశ్వరుడు పార్వతితో)" హే సుముఖీ! రామ నామము విష్ణు సహస్ర నామముతో సమానమైనది. నేను సర్వదా రామ రామ రామ అనుచు మనస్సును రంజింపజేయు రామ నామమందే రమించుచుందును."

రామావతారములో సీతాపహరణానంతరము శ్రీరాముడు రోదించుచు ప్రతి వనమందు వృక్షములను, లతలను పట్టుకొని సీతజాడ అడుగుచు తన ప్రాణప్రియ సీతా వియోగముతో అటునిటు వెదకుచు తిరుగుచుండెను.

అట్టి స్థితిలో శివుడు రాముని దర్శించి ఆనందానుభూతి జెందెను. "పరమాత్మ మానవునివలె ఎట్లు లీలా నాటక మాడుచున్నాడు. నేను ఎదుటపడి వందనము సమర్పించిన నా భగవానుడు సంకోచించునేమో!" అనుకొనుచు వటవృక్షము చాటుగా పరమాత్మను దర్శించెను. ఆయన రోమములు నిక్కపొడిచెను. నేత్రముల నుండి అశ్రుధారలు స్రవించెను.

**జయసచ్చిదానంద జయ పావన।**
**అసకహిచలే మనోజన పావన॥**
**చలే జాత సతీ సమేతా।**
**పునిపుని పులకత కృపాని కేతా॥**

(రామచరిత మానసము)

శ్రీ శివుడు మనస్సునందే "జయసచ్చిదానంద జయ పావన" అనుచు దూరము నుండియే ప్రణామము గావించెను. "జయ జయ" అనుచున్న శివునిగాంచి

సతీదేవి ఆశ్చర్యముతో ''దేవా! మీరు ఎవరికి ప్రణామము చేయుచున్నారు?'' అని అడుగగా శివుడు ''అతడు నా ఇష్టదైవము. ఆ దైవమునే దర్శించుచున్నాను. నా రామునికే వందనము చేయుచున్నా'' ననెను.

భగవానుడు ఎప్పుడు ఏ అవతారమును ధరించినను తన ఆరాధ్యదేవుని బాలరూపము గాంచుటకు శివుడు విచిత్ర విభిన్న వేషములతో ఆయాక్షేత్రములకు వెళ్ళిదర్శించును.

రామావతరమందు శ్రీశంకరుడు కాక భుశుండిని బాలుని గావించి తాను స్వయముగా వృద్ధ జ్యోతిష్కుని వేషము ధరించి అయోధ్యానగర రాణివాసమందు ప్రవేశించెను. కౌసల్యాది మాతలు బాలరాముని జ్యోతిష్కుని యొడియందు కూర్చుండబెట్టిరి. పులకించిన శంకరుడు బాలుని హస్తము, చరణముగాంచెను. ఒడిలో నుంచుకొని ఆడించెను.

శ్రీరాముడు ద్వాపరమున శ్రీకృష్ణావతారమెత్తినప్పుడు శివుడు పులి చర్మము ధరించి ''బాబా భోలేనాథ్'' అని శృంగనాదము చేయుచు వ్రజగోకులమున నంద బాబా ద్వారము చెంతకేగెను.

యశోద బాబా భయంకర రూపము, చుట్టుకొనిన సర్పములు, శరీరమంతట భస్మము, పొడవైన జడలు, ఎర్రని నేత్రములు గాంచి భయముతో బాలుని కనుపించనీయలేదు. బాబా ద్వారము చెంతనే తిరుగుచు శృంగనాదము చేయుచుండెను. బాలుడు భయముతో రోదించసాగెను. యశోద తన బిడ్డకు దృష్టి దోషమేమో యనుకొనుచు సఖిని పంపి బాబాను పిలిపించెను. బాబా కన్నయ్యను ఒడిలోనికి తీసికొనెను. కన్యయ్య చరణములను తన జడలకు తాకించి ముద్దాడెను. బాలుడు నవ్వసాగెను. దృష్టి దోషము పోయెను. నేటికిని నందగ్రామములో బాబా నందేశ్వర నామముతో శివుడు విరాజిల్లుచున్నాడు.

తన ఇష్టదైవమగు శ్రీరామునకు అనన్య సేవ చేయవలెనను కోరికతో శివ భగవానుడు హనుమానుని రూపము ధరించెను. శ్రీరామునకు నిఃస్వార్థ భావముతో సేవలు చేసెను. విభీషణుడు వజ్రాల హారము నివ్వగా దానిని దంతములతో కొరికి వేసెను. విభీషణుడు తనను అవమానించెనేమో యని పరీక్ష పెట్టగా హనుమానుడు తన వక్షః స్థలము చీల్చి రాముని చూపెను.

శంకర భగవానునకు ఇష్టదైవము శ్రీరాముడైన, శ్రీరామునకు ఇష్టదైవము శంకరుడు. ఇద్దరు పరస్పరోపాసకులు.


శ్రీ శివుడే శ్రీరాముడు, శ్రీరాముడే శ్రీ శివుడు. భక్తులను ఆనందింపజేయుటకు స్వయముగ ఆనందించుటకును ఈ విధముగ ఉపాస్య- ఉపాసక- భావముతోను. పూజ్య-పూజక భావముతోను అనేక లీలలు భాగవానుడు చేయుచున్నాడు. భక్తుల పరమారాధ్యుడైన ఆహరి-హరాత్మక స్వరూపమునకు నమస్కారము. ▯

*** కొండ మీద నుండి జారే నీటిని నిలబెట్టటం ఎంత కష్టమో మాట మీద నిలబడని మనిషిని మంచిమార్గంలో నిలబెట్టటం అంతే కష్టం.**

*** మనిషికి వృద్ధాప్యం ఎప్పుడు ప్రారంభమౌతుందంటే "ఇక నేను సాధించవలసింది ఏమీలేదు" అని అతడు నిర్ణయించుకున్న నాటి నుండి.**

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు



## భద్రాచలం (తెలంగాణ - ఖమ్మం)

శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

భద్రాచలం తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం నుంచి 44 కి.మీ. దూరంలో ఉంది. భద్రుని తపః ఫలముగా శ్రీరాముడు వెలసిన ప్రాంతం అవ్వటం వలన ఇది "భద్రగిరి"గా మార్పుచెంది ప్రస్తుతం "భద్రాచలం"గా పిలువబడుచున్నది.

పవిత్ర గోదావరి నదీతీరంలో భద్రగిరి కొండపై సుమారు 40 మెట్ల ఎత్తులో నిర్మితమయింది. శ్రీసీతారామస్వామి దేవాలయం. శ్రీరాముడు పశ్చిమాభిముఖుడై దక్షిణావాహిని అయివున్న గోదావరిని వీక్షిస్తూ ఉండటం ఈ క్షేత్ర ప్రాముఖ్యం.

ఇది శ్రీరాముడు చతుర్భుజునిగా అవతరించిన ఏకైక క్షేత్రం. శ్రీరాముని చతుర్భుజుడని, మోక్ష ప్రదాయుడని, జ్ఞానప్రదాయుడని, భద్రగిరి నారాయణుడని, కళ్యాణ రాముడని, కోదండరాముడని, జగదభిరాముడని, జానకీ వల్లభుడని, కౌసల్యా తనయుడని, దశరధనందుడని కీర్తిస్తారు.

### పంచారామ క్షేత్రం

భద్రాదిని పంచారామ క్షేత్రంగా పిలుస్తారు. శ్రీరాముడు ఐదు రూపాలలో రామాయణంలోని ఐదు అద్భుత సన్నివేశాలను స్ఫురించే విధంగా ఐదు క్షేత్రాలలో వేంచేసియున్నాడు. భద్రాచలంలో "వైకుంఠ రాము"డని, దుమ్ముగూడెంలో "ఆత్మారాము"డని, శ్రీరామగిరిలో "యోగరాము'డని, పర్ణశాలలో 'శోకరాము"డని, దండ కారణ్యంలో అణువణువు నా సంచరించినందున "వనరాము"డని పిలుస్తారు. ఈ ఐదు రాముల రూపాలు గల ఈ క్షేత్రాలనే పంచారామ క్షేత్రాలుగా పిలుస్తారు.

### చరిత్రాధారాలు - పురాణ ప్రసిద్ధి

బ్రహ్మాండ పురాణంలోను, గౌతమీ మాహాత్మ్యంలోను ఈ క్షేత్ర ప్రాశస్త్యము గురించి చెప్పబడింది.

### భద్రుడు

రామావతారంలో శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై వనవాసం చేస్తూ బడలిక తీర్చుకోవడానికి ఓ బండరాయిపై విశ్రమిస్తాడు. తన సేదతీర్చిన ఆ బండ రాయిని శ్రీరాముడు అనుగ్రహిస్తాడు. మరుజన్మలో మానవునిగా పుట్టి శ్రీరామ భక్తునిగా పేరు తెచ్చుకుంటావని వరం ఇస్తాడు. రాముని అనుగ్రహంతో ఆ బండరాయి మేరుపర్వతానికి, మేనకాదేవికి పుత్రునిగా జన్మించి, భద్రుడనే పేరు తెచ్చుకుంటాడు. భద్రుడు నిరంతరం రాముని చింతనలోనే గడిపెడివాడు. కాని ఈ లోగ రామావతారం పరి సమాప్తం కావడంతో రాముడు భద్రుని మాట మరచిపోయి వైకుంఠానికి వెళ్ళిపోయెను. శ్రీరాముని కోసం భద్రుడు ఘోర తపస్సు చేయగా ఆ తపస్సుకు మెచ్చిన శ్రీరాముడు

నేరుగా వైకుంఠం నుంచి లక్ష్మీసమేతంగా వచ్చివరం కోరుకొమ్మనగా, భద్రుడు "నేను కొండగా మారతాను. నీవు విష్ణువు రూపంలో కాక రాముని రూపంలోనే వెలసి నాపై నివాసం ఉండవలెనని కోరగా, శ్రీమహావిష్ణువు ఆ ప్రకారవే చతుర్భుజ రామచంద్రునిగా శంఖ చక్రధనుర్బాణాలతో ఇక్కడ వెలిశాడు.

**పోకల దమ్మక్క**

కొన్ని శతాబ్దాల క్రితం శ్రీరామ భక్తురాలయిన పోకల దమ్మక్క భద్రాచలానికి సమీప గ్రామమైన భద్రారెడ్డిపాలెంలో నివసించేది. ఆమెకు శ్రీరాముడు కలలో కనిపించి సీతారామలక్ష్మణ విగ్రహాలు భద్రగిరి మీద ఉన్నాయి. వాటికి నీడ కల్పించమని ఆదేశించగా ఆమె ఆ విగ్రమాలను దర్శించి వాటికి ఆమె ఒక చిన్న మండపం కట్టించింది. అదే ప్రస్తుత ఆలయానికి మూలమని అంటారు. దిమ్మక్క సమకాలికులు రాసిన ఓ యక్షగానం ఆమెను శబరిగా పేర్కొంది. క్రితం జన్మలో దమ్మక్క శబరి అని రాముని అనుగ్రహంతో శబరి, దమ్మక్కగా జన్మించి సీతారామలక్ష్మణుల విగ్రహాలకు నీడ కల్పించిందని చెబుతారు.

**రామదాసు**

ఈ విగ్రహాలకు అనలయిన ప్రబావం రామదాసుగా ప్రసిద్ధికెక్కిన కంచర్ల గోపన్న హయాంలోనే ప్రారంభమయింది. ఆయన నేల కొండపల్లి నివాసి. కంచర్ల లింగన్న, కామమ్మ దంపతుల ఏకైక పుత్రుడు.అక్కన్న, మాదన్న సోదరులు గోపన్నకు మేనమామలు. అక్కన్న కుతుబ్ షాహీ రాజులలో చివరి వాడైన అబ్దుల్ హస్సన్ తానీషా (1654-1687)కు ప్రదానమంత్రిగా ఉండేవాడు. ఈ ప్రాంతం వీరి ఆధీనంలో ఉండేది. గోల్కొండ వీరి ముఖ్య పట్టణం. గోపన్నకు క్రీశ. 1670లో పాల్వంచ పరగణాలకు తహసీల్దార్ పదవి లభించింది. మొదటి నుంచీ రామభక్తుడవటం, భద్రాది రామునకు సరయిన ఆలయం లేకపోవడం వలన అతను ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల మొత్తం సుమారు 6 లక్షల రూపాయలను భద్రాచలంలోని రామాలయ నిర్మాణానికి ఖర్చుపెట్టి క్రీ.శ. 1674లో ఆలయాన్ని పూర్తి చేసి తానీషా ఆగ్రహానికి గురై 12 సంత్సరాలు కారాగార శిక్ష అనుభవించాడు. ఆయన ఉన్న జైలుగది ఈనాటికీ గోల్కొండ కోటలో ఉంది. తర్వాత శ్రీరాముడే లక్ష్మణ సమేతుడై మారువేషాల్లో రామూజీ, లక్ష్మూజీ పేర్లతో తానీషాకు స్వప్నంలో కనిపించి గోపన్న కట్టవలసిన 6 లక్షల రామమాడ లేదా రామటెంకి అనే బంగారు నాణాలు చెల్లించి వెంటనే క్రీ.శ. 1686లో గోపన్నను విడుదల చేయించారు. దాంతో నవాబు, రామదాసు భక్తి తత్వాన్ని అర్థం చేసుకోవటమే కాక శ్రీరాముని నిత్యపూజకు మణులు, మాన్యాలు ఏర్పాటు చేయటమే కాక రామలక్ష్మణులు తనకు చెల్లించిన 2 బంగారు మాడాలను గుర్తుగా ఇక్కడ ఆలయానికిచ్చెను. రామటంకాలు అని జనం పిలిచే ఈ మాడాలు ఈ నాటికీ ఇక్కడ ఉన్నాయి. వీటిపై ఓ వైపు రామపట్టాభిషేకం, మరోవైపు ఆంజనేయ స్వామి చిత్రాలున్నాయి.

రామదాసు శ్రీరామునికి కలికితురాయి. సీతమ్మకు చింతాకు పతకం, లక్ష్మణునకు ముత్యాల పతకం, భరతుడికి పచ్చల పతకం, శతృఘ్నునికి మొహిరీల మొలతాడు చేయించాడు. ఇవన్నీ ఇప్పటికీ ఇక్కడ ఉన్నాయి.

రామదాసు కీర్తనలలో ముస్లిం భక్తుడైన కబీరుదాసు శ్రీరాముల వారి దర్శనం చేసుకొన్నాడు. రామదాసు, కబీరు దాసు ఉపదేశాన్ని పొందాడట.

**ఆలయవర్ణన**

దేవాలయ ప్రధాన ప్రవేశ ద్వారం మీద ఉన్నతమైన గోపురం ఉంది. ఈ ద్వారం లోపలి ప్రాకారానికి దారి చూపుతుంది. ముఖమంటపం ప్రవేశం దగ్గర జయ విజయులు (ద్వారపాలకులు), ఏక చక్రరథంలాగుతున్న అశ్వాలపై ఆరూఢులై ఉంటారు.

కొన్నేళ్ళకు గర్భకుడి కూలిపోగా 1962 నుంచి 1976 వరకు పునర్నిర్మాణం చేపట్టి గర్భగృహం మీద విమానం గ్రానైట్ రాళ్ళతో నిర్మితమయింది. ఈ విమాన శిఖరాన్ని 30 టన్నుల బరువున్న ఒకే రాయితో మలిచారు. కంచి కామకోటి పీఠాధిపతి చేత ఆలయ గోపురంపై సుదర్శన చక్రాన్ని అమర్చారు. ఈ సుదర్శన చక్రం రామదాసుకు గోదావరి నదిలో లభించిందని చెబుతారు. అష్టభుజిగా ఉన్న ఈ చక్రానికి మధ్యలో సుదర్శనమూర్తిని చెక్కారు. విమానం బయట 48 రూపాలలో విష్ణు, గరుడ, సింహ, సోమ స్కంద, దక్షిణామూర్తులు దర్శనమిస్తారు. దక్షిణివైపుగల చిన్న చిన్న ఆలయాలన్నింటిని తొలగించి ప్రాకార మండపాలు నిర్మించారు.

ఈ ఆలయం పశ్చిమాభిముఖంగా ఉంది. ఆలయమునకు ఎదురుగా ధ్వజ స్తంభము, ఆంజనేయుని దీప స్తంభము, ముఖద్వార గాలి గోపురము, దీనికి కుడి భాగాన రామదాసు విగ్రహము, మెట్లు, మెట్ల ముందు రామభక్తహనుమాన్ విగ్రహము, దీనికి కుడి భాగాన లక్ష్మీతాయారు అమ్మవారు, పరవాసుదేవాస్వామి, భద్రుని కోవెల, భక్తులు రామకోటి వ్రాసితెచ్చే కాగితాలనుంచే గది, సీతమ్మవారి పాదాలు, శ్రీ కనక సీతమ్మవారు, శ్రీగోపాలస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీవరాహస్వామి, హయగ్రీవస్వామి, చెన్నకేశవ స్వాముల విగ్రహాలున్నాయి.

**మూలవిరాటు**

ఇక్కడ మాత్రమే శ్రీరాముడు చతుర్భుజునిగా దర్శనమిస్తాడు. స్వామి స్వయంభువు. విగ్రహాలు 3 అడుగుల ఎత్తుంటాయి. స్వామివారి ముందున్న రెండు చేతులలో కుడి చేతిలో బాణం, ఎడమ చేతిలో విల్లు, వెనుకవున్న రెండు చేతులలో కుడి చేతిలో శంఖము, ఎడమ చేతిలో చక్రం ధరించి 'పద్మాసనుడు'గా ఉన్నాడు. స్వామి వారి ఎడమ తొడపైన సీతమ్మవారు కూర్చొని ఉంటుంది. సీతారాములు ఇరువురూ ఒకేరాతిలో వెలిసి ఉండటం విశేషం.

**మిథిలా కళ్యాణ మండపం**

1964 వరకు సీతారాముల కళ్యాణం రామాలయంలోనే ఉత్తరద్వారంలో నిర్వహించే వారు.అప్పటి ప్రభుత్వములో మిథిలా స్టేడియంలో కళ్యాణ మండపాన్ని ప్రారంభించి 1964లో పూర్తి చేసింది. ప్రముఖ శిల్పకళాకారుడు గణపతి స్థపతి దీనిని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కళ్యాణ మండపం ఉత్తమ కళాఖండానికి చెందినది. ఒక ప్రక్క అటు ఇటు ఏనుగులు, అటురామదాసు, ఇటు కబీరు, నడుమ నాట్యరంగం, క్రింద సోపానంపై కోలాటం, మరోప్రక్క గీతోపదేశం, అటు ఇటు ద్వారపాలకులు హనుమాన్, గరుడులు, నడుమ పద్మపీఠంపై శ్రీరామ పట్టాభిషేకం, కుడి ప్రక్కన చివర శేష తల్పంపై శ్రీమన్నారాయణుడు శయనించిన శిల్పాలు అన్నీ అపూర్వ శిల్ప సంపదలు. (సశేషం)

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

**27.సర్వరోగ హరయోగము :** కరక్కాయ పెచ్చులు, శొంఠి, సైంధవ లవణం. ఈ వస్తువులు సమభాగాలుగా తీసుకొని చూర్ణించి పూటకు పావు తులం చొప్పున తేనె అనుపానములో గాని, మంచినీటిలో గాని త్రాగుచుండిన సర్వవ్యాధులు హరించును.

**28. సర్వవ్యాది హర రసాయనము:** కరక్కాయలు, చిత్రమూలము, శొంఠి, నేలతాడి, తిప్పసత్తు, ఈ వస్తువులను సమభాగాలుగా తీసుకొని చూర్ణించి నిల్వ వుంచుకొని పూటకు పావు తులం చొప్పున తేనెతో అనుపానంచేసి తినుచుండిన యెల బలవృద్ధి, తేజోవృద్ధి, వీర్యవృద్ధి కలుగజేసి సర్వవ్యాధులను హరించి దీర్ఘాయువు జీవిత సౌఖ్యము కలుగజేయును.

29. **స్వర్ణపాక రసం (సమస్త రోగములకు)** : పొంగించిన వెలిగారము చూర్ణమును గుంట గలగరాకు రసంలో నూరు సార్లు భావనము చేసి తరువాత శనగ గింజలంత మాత్రలు చేసి తగిన అనుపానముతో ఇచ్చుచుండిన సమస్త వ్యాధులు హరించును.

30. రెండు తులాల కిస్‌మిస్ పండ్లను ఒక గ్లాసులో వేసి అందు నిమ్మరసం పిండి గ్లాసు సగానికి నీరు పోయవలెను. ఒకరాత్రి అంతా నిలు వుంచి మరునాడు ఉదయం గ్లాసులోని రసమును త్రాగి కిస్‌మిస్ పండ్లు నమిలి మ్రింగవలను. ఇట్లు 40 దినములు సేవించిన యెడల శరీరమునకు అమితమైన బలము కలుగును.

31.ఉసిరిక వలుపు చూర్ణము 10 తులాలు, పటిక బెల్లంపొడి 10 తులాలు రెండూ కలిపి మెత్తగా నూరి సీసాలో పోసి భద్రపరచుకొని పూటకు అర తులం చొప్పున ప్రతిరోజూ ఉదయం, సాయంత్రంనందు తినుచుండిన ఎడల అన్ని రకములైన గుండె జబ్బులు గుండె దడ హరించును.

32. పొట్టులేని చాయ మినపపప్పు ఒక సేరు నందు ఒక సేరు నీరుల్లిపాయుల రసం పోసి యెండబెట్టవలెను. ఇలా ఉల్లిపాయల రసం పీల్చువరకు మినపపప్పును భావన చేసి సీసాలో భద్రపరచవలెను. 2 తులాల మినపప్పును అరలీటరు పాలలో వేసి, వండి అందు 1 తులము నెయ్యి, 2 తులాల పంచదార కలిపి ప్రాతఃకాలమున తినవలయును. ఇట్లు 40 రోజులు సేవించిన యెడల అమితమైన బలము, వీర్యదోషములు హరించి మగతనము ఎక్కువగును.

**33. రసాయన దధి అమృతము** : రెండు రోజులు నిల్వవుంచిన పుల్లటి పెరుగు - 4 సేర్లు, పటిక బెల్లం 48 తులాలు, నెయ్యి 3 తులాలు, మిరియాల చూర్ణము 4 తులాలు, తేనె 3 తులాలు, శొంఠిచూర్ణము 1 1/2 తులం, దాసిం చెక్క, ఆకు పత్రి ఏలకులు, నాగకేసరాలు సమభాగాలుగా కొట్టిన చూర్ణము 1 1/2 తులం, పరిశుభ్రమైన చేతితో బాగా పిసికి, గుడ్డలో వేసి వడకట్టుకొని అందు 1/4 తులం పచ్చకర్పూరం చూర్ణం కలిపి జాడీలోగాని, సీసాలోగాని పోసి భద్రపరచవలెను. ఈ దధిని ప్రతి రోజూ 1 గ్లాసు పరిమాణంలో సేవించిన యెడల ఆకలి బాగా అభివృద్ధి చెంది బలము కలుగును. ఆయుర్దాయము ఎక్కవగును. సర్వరోగంబులు హరించును. దధి అమృతము టానిక్కువలె పనిచేయును.

- పుల్లటి పెరుగు 90 తులాలు, దాసించెక్క చూర్ణం 3/4 తులం, ఏలక్కాయల చూర్ణము 3/4 తులం, తేనె 1 1/2 తులం, నెయ్యి 1 1/2 తులం, మిరియాల చూర్ణం 1 1/2 తులం, పటిక బెల్లం చూర్ణం 24 తులాలు, ఈ వస్తువులన్నీ ఏకం చేసి చేతితో బాగా పిసికి, గుడ్డలో వేసి వడకట్టుకొని అందు కొద్ది గా పచ్చ కర్పూరం చూర్ణం చేసి బాగా కలిపి సీసాలో భద్రపరచుకొని రోజూ ఒక గ్లాసు పరిమాణంలో తాగుచుండిన యెడల అగ్నిమాంద్యము హరించి, రక్తవృద్ధి అయ్యి, ఆయువు పెరుగును. సర్వరోగములు హరించి మనస్సు సంతోషముగా ఉండును.

# వాస్తు- సైన్సు

.... ఆళ్ళ రామకృష్ణ, రాజేంద్రనగర్, గుంటూరు. 9492464366

## వాస్తును నమ్మాలా ?

ఇది ప్రస్తుతము కొంతమంది నుంచి ఎదురవుతున్న ప్రశ్న. కానీ, నమ్మితీరవలసిందే. ఎందుకంటే, ఈ శాస్త్రంలో వున్నటువంటి మహత్తర శక్తి అలాంటిది. అది అనుభవములోనికి వచ్చినపుడు మాత్రమే మనము ఆ విషయాన్ని పూర్తి స్థాయిలో అర్థం చేసికోగలుగుతాయి. మన భారతదేశ ప్రాచీన చరిత్ర, సంస్కృతి సాంప్రదాయాల గురించి, విజ్ఞాన వీచికల గురించి ఒకసారి అవలోకనం చేసికోకుంటే, ప్రపంచలో ఇప్పుడు కనుగొన్నారు, కనుగొంటున్నారు అని చెప్పుకుంటున్న విషయాలను, మనదేశంలో శాస్త్రజ్ఞుడు అనే పేరులేకుండా, వాటిని తెలియపరచటం జరిగింది. మచ్చుకు కొన్ని విషయాలను పరిశీలిద్దాం.

- ఈనాడు మనం వుపయోగించే అంకెలు, సున్నా భారతీయుల కృషే.

- వృత్తి వైశాల్యాన్ని దాదాపు కచ్చితంగా లెక్కగట్టిన భాస్కరుడు భారతీయుడే.

- దాదాపు 1600 సంవత్సరాల క్రితం, ఆర్యభట్ట భూమి గుండ్రగావుందని చెప్పటం జరిగింది.

- న్యూటన్ కంటే 1500 సంవత్సరాల క్రితం వరాహమిహిరండు భూమికి అయస్కాంతశక్తి వుందని తలపటం జరిగింది.వరాహ మిహరుడు భారతీయుడే. అతడు వాస్తుశాస్త్రములో గూడ దిట్ట.

- సూర్యకాంతిలో ఏడు రంగులున్నాయన్న విషయాన్ని, సూర్యుడు ఏడు గుఱ్ఱాల రథంపై ప్రయాణిస్తున్న విషయం సంకేతంగా చెప్పబడింది భారతదేశంలోనే.

- నేడు ధృవనక్షత్ర విశ్వ పరిభ్రమనానికి 26,000 సంవత్సరాలు పడుతుందని కనుగొనబడింది. మన పురాణాలలో ధృవునికి 26000 సంవత్సరాల నక్షత్రంగావుండమని వరమిచ్చినట్లు వివరించబడింది.

- పరిణామక్రమంలో మానవ శరీరం రూపొందించబడిందని, ప్రస్తుత శాస్త్రము చెబుతున్న తరుణంలో, దశావతారాల పోలిక ద్వారా, మన ఇతిహాసాలలో వివరించబడింది.

ఇవన్నింటి గురించి, ఎందుకు మాట్లాడుకుంటున్నామంటే, వీటన్నింటి గురించి మన పూర్వీకులు వివరించినట్లే, వాస్తుశాస్త్రాన్నిగూడ, మన పెద్దలు మనకు ప్రసాదించడం జరిగింది. ప్రస్తుతము మన శాస్త్రవేత్తలు కూడ కొన్ని విషయాలను ధృపపరచడం జరిగింది. కాబట్టి వాస్తు ఎప్పుడూ తప్పదు. తప్పుదోవ పట్టించదు. కాకపోతే, కొంతమంది వాస్తును సరిగా అర్థం చేసికోకుండా, వాస్తు గురించి సరిగా పరిశీలన చేయకుండా వాస్తు గురించి చెప్పడం వలన, మరి కొందరు గృహస్తుల సౌకర్యాల కనుగుణంగా మార్చిచెప్పడం వలన వాస్తు తప్పుదోవ పడుతున్నట్లుగా వుంది.

వాస్తుశాస్త్రంలో నియమాలు, కారణాలు విశదీకరించకుండా వ్రాయడం వలన, వాస్తుమీద దురభిప్రాయం కొంతమందిలో ఏర్పడింది. తులసి ఆకు నమిలితే కఫం తగ్గుతుంది. ఎలా నిరూపించడం ? అది వుపయోగించి, అనుభవం ద్వారానే చెప్పగలం. అందుకే, వాస్తు ఫలితాలను పూర్తిస్థాయిలో పొందాలంటే, సరియైన వాస్తు పండితుని సలహాతో గృహనిర్మాణం చేపట్టి, మీ అనుభవాలను ఇతరులకు కూడా పంచండి. నమ్మండి నమ్మించండి.

సర్వేజనాస్సుఖినో భవంతు

అన్ని వృత్తులలో సేవకావృత్తి చాలా గొప్పది.సేవ అనగానే ముందు మానపూర్వీకులైన ఆంజనేయస్వామి సిద్ధయ్య మొదలగు గొప్ప శిష్యులు గుర్తోస్తారు. శిష్యుడు అంటే తన గురువుకు శరగాగత భక్తితో సేవ చేసేవాడని చెప్పవచ్చు. త్లిదండ్రులను వదలి కందిమల్లయ్యపల్లె చేరి, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామిఆరిని గురువుగా స్వీకరించి సేవించి సుప్రసిద్దుడైనాడు సిద్ధయ్య, "గురువులందరిన్ని శ్రీ వీరబ్రహ్మేంద్ర గురుడు గురుడు శిష్యులందన్న పరిపూర్ణ సిద్ధయ్య అనే సుప్రసిద్ధనానుడిని మనము వింటుంటాము.

సేవకావృత్తిలో ఆంజనేయ స్వామిని గురించి వేరే చెప్పనక్కరలేదు. అందుకు రాముయణంలో అనేక సంఘటను మనకు కనిపిస్తుంటాయి. రామభక్తులలో కొందరికి ఆంజనేయస్వామి మఅద అసహ కలిగిగింది. కారణమోమంటే రామునికిసంబంధించినప్రతిపనీ తానేచేసుకుపోతునందువలన మరలావారికిరామునిసేవిచే అవకాశం లభించటం లేదట.అందుచేత వారు సీతమ్మవారి ద్వారా రామునికీ విషయాన్ని తెలియజేశారు. మరునాడు అందరికీ తలో పని అప్పగించింది సీతామాత అయితే ఆ సమయంలో ఆంజనేయుడు లెనందున వున్న సేవలన్ని తలోకటీ స్వీకరించారు. ఆ మరునాడు ఆంజనేయుడు వచ్చాడు. తాను తన ప్రభువుకి ఏ పని చేయబోతున్నా ఎవరో ఒక్కరు అడ్డుతగులుతున్నారు. ఈ సేవవాది అంటునానరు. విషయాన్ని విన్నవించాడు. నాయనా న్నిటి దినం నావులేదు. వారందరు వున్న పనులన్ని పంచుకున్నారు. మిగిలివున్న పనేమైనా వుంటే చెప్పఅదినీకిస్తానన్న రామయ్య. సీతామాలకు నమస్కరించి వెంటేనే అమ్మా! రామప్రభువుకు ఆవలింత వస్తే చిటికె వెరు వెస్తారు ? అన్నాడు. అందరూ అవాకుయ్యారు. ఆ పనిని ఆంజనేయునికి అప్పగిస్తూ రాజముద్రిక వెసింది సీతామాత.

ఆంజనేయుడు తన ప్రభువు ఎటు వెళుతున్నా ఏ పని చెస్తున్నా చిఇక వేయటకు సిద్ధంగా స్వామి ననుసరిస్తున్నాడు. స్వామికి పాప్రక్షాళన చెస్తున్నా పాదాలు తుడుస్తున్నా స్వామినంటిపెటుట్టకొనే వుంటుంన్నాడు. ఆ మిగతా పరివారం వారి వారి సేవలను ముగించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆంజనేయుడు మాత్రం నిరంబర సేవ చేస్తున్నాడు.

రాత్రి అయింది. స్వామి విశ్రమించుటకు శయనమాది దానికి వెళ్ళాడు. రామప్రభువు విశ్రమించాడు. సీతామాత ఆంజనేయునితో "నాయనా! ఇకనీవు వెలుపలకి వెళ్ళు" అన్నది. అగేలాగమ్మఆ ? నేను వెళ్ళనన్నాడు. నేను విశ్రమించాలి నీవు వెళ్ళు నాయనా! అనదాయమ్మ.

విశ్రమించండ నా కర్తవ్యాన్ని నేను నిర్వహించాలి కదా ? అనాడాయన. వేము భార్యాభర్తలమయ్యా నీవు వెలుపలికి వెళ్ళు అన్నది. అయితే ఎమిటి నేను వెళ్ళనన్నాడు. భార్యభర్తలు వుండే గదిలో నీవు వుండరాదన్నదామె. వుంటే ఏమిటి ? అన్నాడాంజనేయుడు. అయ్యో నీవు ఘోటక బ్రహ్మచారివి నేను చెప్పేది నీకు ర్ధంకాదు. ముందు నీవు వెలుపలికి వెళ్ళు" అన్నది. నేను వెలుపలికి వెళ్ళితే "అయ్యావారికి ఆవలంత వస్తే చిటిక వెవరెస్తారమ్మా అన్నాడు. నెనేస్తాలెవయ్యా అన్నదామె! అదెలా వెళ్ళు నమ్ము అన్నది. "సీతామాత కొంచెం కోపంకటస్తూ నేను విన్నపిస్తున్నాను నీవు వెలిపలికి వెళ్ళు అన్నది" ఆంజనేయుడు చేసేదిలేక అక్కడి నుండీ చిటికెలు వెస్తూ వెలుపలికి వచ్చాడు. అంటే తాను వెలుపలికి వచ్చినప్పడు ఒక వేళ రాముడు ఆవలించినా ఇబ్బందిలేకుండా వుండలన్నది ఆయన అభిమతం.

ఆంజనేయుడు చిటికెలు వేయటం ప్రారంభించగానే లోపల రాములవారు ఆవలించటం మొదలుపెట్టాడు. వెలుపలివున్న ఆంజనేయుడు జయ రామ్ - సీతారామ్" అంటూ సంకీర్తన చెస్తూ చిటికేలు వేస్తున్నాడు. ఆ రాభక్తితన్మాయంతో వేగంగా చిటికేలు వేస్తుంటే రాముడునికి కూడా అంతే వేగంగా ఆవలింతొస్తున్నాయి.

సీతామాత విశ్రామపరిచర్యలు చేసునా రామునికి ఆవలింతలు ఆగలేదు. కౌసల్య సుమిత్రకై ముగ్గురు మాతలను పిలిచింది. సీతామాత అందరూ చేరారు. రాజవైద్యులు వచ్చారు. ఎవరు విన్న ఉపచర్యలు చేసినా రాముని ఆవలింతలు ఆగలేదు. ఆంజనేయుడు భక్తి తన్మయంలో వేగంగా నామం చేస్తూ చిటికెలు వేస్తుంటే రాముడూ వేగంగా ఆవలిస్తు విపరీతమైన ఆవేదనకు గురి అవుతున్నాడు. రాజవైద్యులుకు ఆ వ్యాధి ఏమిటో కబురంపింది కౌసల్యాదేవి, వశిస్టులవారు వచ్చారు. పరిస్థితని గమనించాడు. ఇంతకూ మన ఆంజనేయుడు ఎక్కడ ? అని అడిగాడు వాడు అడిగో ఆ వెలుపల గోడ మీద కూర్చోని చిటికేలు వేసుకుంటూన్నడని చెప్పారు. అమ్మా! ఈ ప్రభవు వ్యాధికి పరిష్కారం ఆ ఆంజనేయుని చిటికేలలో వున్నది. అక్కడ ఆయన చిటికెలుఉ ఆపివేసే ఇక్కడ రామునికి ఆవలింతలు తగ్గుతాయని చెప్పాడు. ఎవరు చెప్పినా ఆంజనేడు చిటికేలు ఆపలేదు. వశిష్టుడు వెళ్ళి ఆంజనేయా ! మీ ప్రభువుకు సుస్తిగా వున్నదయ్యా ఇటుదా! అన్నాడు. వెంటనే ఆంజనేయుడ ఆ...! నా ప్రభువుకు సుప్తిగావున్నదా ? అంటూ చిటికేలు ఆపి స్వామి చంతకు వచ్చాడు. అంతే రాముని ఆవలింతలు ఆగాయి.

భక్తి అనేది అధికారంతోనో, సేవలుచేయించుకోవటంతోనో వచ్చేదికాదు. రాముని వద్ద సేవలు వేయించుకున్న భారంతో వారి వారి పనులను చేసుకొనివారి సమయం అయిపోగానే విశ్రమించారు. ఏ పని! చేయనివ్వటంటేదు అన్నవారు. పనీ ఇవ్వగానే సమయం ఏప్పడేప్పడాయిపోతుంఆ అని సమాకాగానే జారుకున్నారు.

ఏ పనికానీ లేకపోయినా, చిటికే అని ఒక పనిని సృష్టించుకొని వ్లెలవేళ్ళల తన ప్రభువు సేవలో వున్నాడు ఆంజనేయుడు. హృదయాంతరాళం నుండి రావాలి. పవిత్రతతో సంమార్గ విశ్వాసంతో చేయాలో దానికి వెలలులేవు, వెల్లలూవుండవు.

ఇది ప్రతి శిష్యుడనూ, భక్తుడును గ్రహించాలి.

తేది 13-8-2015న హనుమజ్జయంతి సందర్భంగా సమర్పణ

Sri Achalananda Ashramam, Ongole and Thotlapalli